విలేకరులు కావలెను

మనవార్త దినపత్రిక లో
పనిచేయుటకు విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల
వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను
Cell: 9666033186
9866092624



# మన వార్త

ప్రజాగళానికి అక్షర రూపం

MANA VAARTHA

EPAPER.MANAVAARTHA.NET

MANA VAARTHA

Telangana | సంపుటి: 1, సంచిక: 249 | volume: 1, Issue:249 | బుధవారం 08 ఏప్రిల్ 2026 పేజీలు : 8 వెల : 3.00

PUBLISHED: KARIMNAGAR,HYDERABAD    CMD&EDITOR:BHUPATHI SANTHOSH


## ఇరాన్ రక్షణ కోసం ప్రాణత్యాగానికి సిద్ధం

- అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్...
- 14 మిలియన్ల మంది ప్రజలతో కలిసి పోరాడతామని ప్రకటన...
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ డెడ్‌లైన్ నేపథ్యంలో హెచ్చరిక...
- పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు...



**టెహ్రాన్, ఏప్రిల్ 07 :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పరాకాష్ఠకు చేరుకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన గడువు ముగియనున్న నేపథ్యంలో, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అత్యంత కీలకమైన మరియు భావోద్వేగపూరితమైన ప్రకటన చేశారు. ఇరాన్ రక్షణ కోసం తన ప్రాణాలను సైతం పణంగా పెట్టడానికి సిద్ధంగా ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. తనతో పాటు దేశంలోని 14 మిలియన్లకు పైగా ప్రజలు స్వచ్ఛందంగా ప్రాణత్యాగానికి ముందుకు వచ్చారని, దేశ సార్వభౌమాధికారం విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదని ఆయన 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. ఈ వివాదానికి ప్రధాన కారణం వ్యూహాత్మకమైన హర్మూజ్ జలసంధి. ఈ కీలకమైన చమురు రవాణా మార్గాన్ని ఇరాన్ అదుపులోకి తీసుకోవడంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాకు విఘాతం కలిగింది. దీనిపై తీవ్రంగా స్పందించిన ట్రంప్, గడువులోపు జలసంధిని తెరవకపోతే ఇరాన్‌లోని ప్రతి పవర్ ప్లాంట్, వంతెన మరియు కీలక మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. "ఈసారి డెడ్‌లైన్ పొడిగింపు ఉండదు, ఒక్క రాత్రిలోనే ఇరాన్‌ను తుడిచిపెట్టేస్తాం" అంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు యుద్ధ భయాన్ని రెట్టింపు చేశాయి. అమెరికా హెచ్చరికలను ఇరాన్ ఏమాత్రం లెక్కచేయడం లేదు. కేవలం తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందాలకు తాము అంగీకరించబోమని, తమ శాశ్వత డిమాండ్లను నెరవేర్చాలని ఇరాన్ పట్టుబడుతోంది. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా ఉన్న యువత, అథ్లెట్లు మరియు కళాకారులు తమ దేశంలోని విద్యుత్ కేంద్రాల చుట్టూ 'మానవ హారాలు'గా ఏర్పడి అమెరికా వైమానిక దాడులను అడ్డుకోవాలని ఇరాన్ ప్రభుత్వం పిలుపునిచ్చింది. మౌలిక సదుపాయాల రక్షణ కోసం ప్రజలే కవచంలా నిలబడాలని అధ్యక్షుడు కోరారు. మరోవైపు, పలు దేశాలు మధ్యవర్తిత్వం వహిస్తూ శాంతి చర్చల కోసం ప్రయత్నిస్తున్నప్పటికీ, ఇరు దేశాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. ఇరాన్ ఇప్పటికే తాత్కాలిక కాల్పుల విరమణ ప్రతిపాదనలను తిరస్కరించినట్లు తెలుస్తోంది. ఇరాన్ ఇంధన క్షేత్రాలపై గతంలో జరిగిన దాడుల వల్ల ఇప్పటికే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నప్పటికీ, వెనక్కి తగ్గేది లేదని పెజెష్కియాన్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. 90 మిలియన్ల జనాభా ఉన్న ఇరాన్‌లో 14 మిలియన్ల మంది యుద్ధానికి సిద్ధంగా ఉన్నారని ఆయన చెప్పడం ద్వారా అమెరికాపై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష యుద్ధం అనివార్యమనిపిస్తోంది. ట్రంప్ విధించిన గడువు మరికొన్ని గంటల్లో ముగియనుంది. ఒకవేళ అమెరికా దాడులకు దిగితే, అది కేవలం పశ్చిమాసియాకే పరిమితం కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. చమురు ధరలు ఆకాశాన్ని తాకడంతో పాటు, అంతర్జాతీయంగా రవాణా వ్యవస్థలు స్తంభించిపోయే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రానున్న కొన్ని గంటలు ప్రపంచ శాంతికి అత్యంత కీలకంగా మారాయి.

## రేవంత్ రెడ్డి వర్సెస్ పినరయి విజయన్




**హైదరాబాద్, ఏప్రిల్ 07 :** తెలంగాణ మరియు కేరళ ముఖ్యమంత్రుల మధ్య గత కొన్ని రోజులుగా సాగుతున్న మాటల యుద్ధం మంగళవారం పతాక స్థాయికి చేరుకుంది. కేరళ సీఎం పినరయి విజయన్ చేసిన విమర్శలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత ఘాటుగా, గణాంక సహితంగా బదులిస్తూ ఒక బహిరంగ లేఖను విడుదల చేశారు. విజయన్ తన విమర్శల్లో అమర్యాదకరమైన భాషను ఉపయోగించారని ఆక్షేపించిన రేవంత్, "మీ డాష్ కామెంట్‌కు నేను రాష్‌గా సమాధానం చెప్పను" అంటూ వ్యంగ్యంగా చురక అంటించారు. తమ మధ్య రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ, విజయన్ తెలంగాణకు వచ్చినప్పుడు ఒక అతిథికి ఇవ్వాల్సిన గౌరవాన్ని ఖచ్చితంగా ఇస్తానని రేవంత్ స్పష్టం చేస్తూ, ఈ వివాదానికి ఇదే తన చివరి స్పందన అని లేఖను 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. పినరయి విజయన్ పాత గణాంకాలను ఉటంకించడంపై రేవంత్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. 2023-24 నాటి నీతి ఆయోగ్ నివేదికలు గత బీఆర్ఎస్-బీజేపీ పాలనను ప్రతిబింబిస్తాయని, వాటిని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆపాదించడం సరికాదని హితవు పలికారు. "2024-25 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ అద్భుతమైన వృద్ధిని సాధించింది. రాష్ట్ర జీఎస్‌డీపీ రూ. 16.12 లక్షల కోట్లకు చేరడమే కాకుండా, 10.1 శాతం వృద్ధి రేటుతో జాతీయ సగటును మించిపోయింది. ముఖ్యంగా ఆర్బీఐ గణాంకాల ప్రకారం తెలంగాణ తలసరి ఆదాయం రూ. 3.87 లక్షలకు పెరిగి, కేరళతో పాటు కర్ణాటక, తమిళనాడు వంటి రాష్ట్రాలను అధిగమించి దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది" అని రేవంత్ గర్వంగా ప్రకటించారు. కేరళలో పేదరిక నిర్మూలనపై విజయన్ చేస్తున్న ప్రకటనలను రేవంత్ రెడ్డి ఆధారాలతో సహా ప్రశ్నించారు. 2025 చివరి నాటికి తీవ్ర పేదరికాన్ని నిర్మూలిస్తామని విజయన్ గతంలో ప్రకటించారని, కానీ ఇప్పుడు ఏప్రిల్ 2026 నడుస్తున్నా ఇంకా వేలాది కుటుంబాలకు మైక్రో-ప్లాన్‌లు అందజేస్తున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. పేదరిక నిర్మూలనపై విజయన్ చేసిన ప్రకటనను ఏదైనా స్వతంత్ర సంస్థ ధృవీకరించిందా అని నిలదీశారు. కేరళ సాధించిన సామాజిక విజయాలు దశాబ్దాల కృషి ఫలితమే తప్ప, అది కేవలం విజయన్ హయాంలోనే జరగలేదని రేవంత్ గుర్తుచేశారు. అవినీతి రహిత పాలన గురించి మాట్లాడే విజయన్, తన కార్యాలయంపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పాలని రేవంత్ డిమాండ్ చేశారు.

## ఖమ్మంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



ఖమ్మం, ఏప్రిల్ 07 : ఖమ్మం నగరంలోని వెంకటేశ్వర నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల నాణ్యతను సమీక్షిస్తూ, రోగులకు సమర్థవంతమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రాధాన్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, ల్యాబ్, మెడికల్ వార్డ్, టాయిలెట్లు, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు సక్రమంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. అవసరమైన ఔషధాల లభ్యతపై ప్రత్యేకంగా విచారించిన కలెక్టర్, అన్ని రకాల మందులను తగిన స్థాయిలో నిల్వ ఉంచాలని ఆదేశించారు. మెడిసిన్ స్టాక్, అటెండెన్స్ రిజిస్టర్, ఓపీ రిజిస్టర్ వంటి పత్రాలను పరిశీలించి, నిర్వహణలో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. ల్యాబ్ పరీక్షలు, డయాగ్నస్టిక్ హబ్ సేవల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పరీక్షల ఫలితాలను ఆలస్యం లేకుండా త్వరగా అందించాలని పేర్కొన్నారు. రోగుల చికిత్సలో వేగం, నాణ్యత రెండూ ముఖ్యమని తెలిపారు.

## భారత సైన్యానికి కొత్త అస్త్రం



డెస్క్, ఏప్రిల్ 07: భారత సైన్యం ఆధునిక యుద్ధ సాంకేతికత వైపు మరో కీలక అడుగు వేసింది. శత్రువులను క్షణాల్లో నిర్వీర్యం చేసే సామర్థ్యంతో కూడిన కామికాజి డ్రోన్లను సైన్యంలో ప్రవేశపెట్టే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి. ఇవి ఆత్మాహుతి డ్రోన్లుగా పిలవబడుతూ లక్ష్యాన్ని గుర్తించి నేరుగా ఢీకొని దాడి చేసే ప్రత్యేకత కలిగి ఉంటాయి. ఈ డ్రోన్లు గంటకు సుమారు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలవు. వేగవంతమైన కదలికతో శత్రు లక్ష్యాలను గుర్తించి తక్షణమే దాడి చేయగల సామర్థ్యం వీటికి ఉంది. యుద్ధభూమిలో తక్షణ ప్రతిస్పందనకు ఇవి ఎంతో కీలకంగా మారనున్నాయి. దాదాపు 10 కిలోమీటర్ల పరిధిలో ఉన్న లక్ష్యాలపై ఈ డ్రోన్లు ఖచ్చితంగా దాడులు చేయగలవు. శత్రువుల స్థావరాలు, ఆయుధ నిల్వలు, గస్తీ కేంద్రాలపై దాడి చేయడంలో ఇవి సమర్థవంతంగా పనిచేస్తాయి. టార్గెట్‌ను ముందుగానే గుర్తించి, దానికి అనుగుణంగా దాడి చేయడం వీటి ప్రత్యేకత. ఈ కామికాజి డ్రోన్లు గరిష్ఠంగా 2.5 కిలోల వరకు పేలుడు పదార్థాలను మోసుకెళ్లగలవు. చిన్న పరిమాణంలో ఉన్నప్పటికీ, భారీ నష్టం కలిగించే సామర్థ్యం వీటికి ఉంది. తక్కువ ఖర్చుతో అధిక ప్రభావాన్ని చూపించే యుద్ధ సాధనంగా ఇవి నిలుస్తాయి.

## ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్ సేవలు ప్రారంభం

### ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు లక్ష్యం

- **ఎస్పీ నితికా పంత్...**
- **అసిఫాబాద్ జిల్లాలో పోలీస్ సేవలకు నూతన దిశ...**
- **ఇంటి వద్దే ఫిర్యాదు నమోదు సౌకర్యం...**



**ఆసిఫాబాద్, ఏప్రిల్ 07 :** అసిఫాబాద్ జిల్లాలో ప్రజలకు మరింత సులభంగా, వేగవంతంగా పోలీస్ సేవలు అందించేందుకు "ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్ (డోర్‌స్టెప్ ఎఫ్ఐఆర్)" విధానాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే తమ ఫిర్యాదులను నమోదు చేసుకునే అవకాశం కల్పించడం ఈ విధానం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా పోలీసులు నేరుగా సంఘటనా స్థలానికి లేదా బాధితుల నివాసానికి చేరుకుని



అక్కడే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారని ఎస్పీ వివరించారు. దీంతో బాధితులకు సమయం ఆదా అవడంతో పాటు, సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రత్యేకంగా మహిళలు, వృద్ధులు, దూర ప్రాంతాల్లో నివసించే వారికి ఈ సేవ ఎంతో ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొన్నారు. తక్షణ స్పందనతో సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రజల్లో పోలీసులపై విశ్వాసం పెరుగుతుందని తెలిపారు. పోలీస్ వ్యవస్థలో పారదర్శకతను పెంపొందించేందుకు ఈ విధానం కీలకంగా మారనుందని ఎస్పీ పేర్కొన్నారు. ప్రతి ఫిర్యాదును వెంటనే నమోదు చేసి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ పోలీస్ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు కృషి చేస్తున్నామని ఎస్పీ వెల్లడించారు. ప్రజలకు మెరుగైన భద్రత కల్పించడం తమ ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజలు ఈ సేవను వినియోగించుకుని తమ సమస్యలను సులభంగా తెలియజేయాలని ఎస్పీ నితికా పంత్ సూచించారు. అసిఫాబాద్ జిల్లాలో శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీస్ శాఖ కట్టుబడి ఉందని తెలిపారు.

## సాక్ష్యాలతో కేసు దిశ మార్చిన మహిళా హెడ్ కానిస్టేబుల్

- తొమ్మిది మంది పోలీసులకు కోర్టు దోషి తీర్పు...
- కస్టడీలో తండ్రి-కొడుకు మృతి కేసులో కీలక మలుపు...





**డెస్క్, ఏప్రిల్ 07 :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సాత్తాన్‌కుళం కస్టడీ మరణాల కేసులో తాజాగా కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. 2020లో తమిళనాడులో జరిగిన ఈ ఘటనలో తండ్రి జేయరాజ్, కుమారుడు బెన్నిక్స్ మరణాలకు సంబంధించిన కేసులో తొమ్మిది మంది పోలీసులను కోర్టు దోషులుగా తేల్చింది. అనంతరం వారికి మరణదండన విధిస్తూ చారిత్రాత్మక తీర్పు వెలువడిన విషయం విదితమే, ఈ కేసులో విచారణ సందర్భంగా మొత్తం 100కి పైగా సాక్షులను విచారించగా, మహిళా హెడ్ కానిస్టేబుల్ రేవతి ఇచ్చిన వాంగ్మూలం అత్యంత కీలకంగా నిలిచింది. సంఘటన జరిగిన పోలీస్ స్టేషన్‌లో జరిగిన విషయాలను ఆమె స్పష్టంగా వివరించడం ద్వారా దర్యాప్తుకు కీలక దిశ లభించింది. సీబీఐ దర్యాప్తులో బయటపడిన వివరాల ప్రకారం, బాధితులను తీవ్రంగా హింసించి, ఆ తర్వాత సాక్ష్యాలను తొలగించే ప్రయత్నాలు కూడా జరిగాయి. రక్తపు మరకలను శుభ్రం చేయడం, వస్త్రాలను మార్చడం వంటి చర్యలు తీసుకున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో రేవతి వంటి సాక్షులు ముందుకు రావడం కేసు పరిణామాలను పూర్తిగా మార్చింది. అదే వ్యవస్థలో పని చేస్తూ నిజం బయటపెట్టడం ఆమె ధైర్యానికి నిదర్శనంగా నిలిచింది. న్యాయవ్యవస్థకు సహకరించిన ముఖ్య వ్యక్తుల్లో ఆమె ఒకరుగా గుర్తింపు పొందారు. సుమారు ఆరు సంవత్సరాల పాటు సాగిన ఈ కేసులో సీబీఐ సుమారు 2000 పేజీల చార్జ్ షీట్ దాఖలు చేసి, 100కి పైగా సాక్ష్యాలు, పత్రాలను సమర్పించింది. దీర్ఘకాల విచారణ అనంతరం కోర్టు ఈ తీర్పును వెలువరించింది. ఈ తీర్పుతో కస్టడీ హింసపై దేశవ్యాప్తంగా మరోసారి చర్చ ప్రారంభమైంది. న్యాయం ఆలస్యమైనా అందిందన్న భావన వ్యక్తమవుతుండగా, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## పందిమడుగు గ్రామంలో వడగండ్ల వర్షం దెబ్బ 150 ఎకరాల్లో వరి పంట నష్టం, రైతులకు పరిహారం కోరుతూ వినతి



**సిరికొండ, ఏప్రిల్ 07 (మన వార్త)** సిరికొండ మండలంలోని పందిమడుగు గ్రామంలో ఇటీవల కురిసిన వడగండ్ల వర్షం కారణంగా వరి పంట తీవ్రంగా దెబ్బతిన్నది. గ్రామంలో దాదాపు 1500 ఎకరాల్లో వరి సాగు జరుగుతుండగా, అందులో సుమారు 150 ఎకరాల్లో పంట పూర్తిగా నష్టపోయినట్లు గ్రామ రైతులు తెలిపారు. ఈ నేపథ్యంలో పందిమడుగు గ్రామ వి సి డి ఆధ్వర్యంలో మండల తహసిల్దార్ (ఎమ్మార్వో) గారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. వడగండ్ల వర్షం వల్ల జరిగిన పంట నష్టాన్ని తక్షణమే వ్యవసాయ అధికారులతో క్షేత్రస్థాయిలో అంచనా వేయించి, బాధిత రైతులకు సరైన నష్టపరిహారం అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో (ఏ ఎల్ యు కె ఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి బి. బాబన్న, వి సి డి అధ్యక్షులు మోహన్ నాయక్, ఉపాధ్యక్షులు బన్సీ నాయక్, కార్యదర్శి కొంకటి ఆశిష్, కోశాధికారి ఈర్ల రవి, అలాగే సభ్యులు బి. బాలు, శ్రీను, నర్సన్న తదితరులు పాల్గొన్నారు.

## సేవే జీవితం విద్యే ఆయుధం గురువు జాకీర్ హుస్సేన్‌కు కన్నీటి నివాళులు




**సిరికొండ, ఏప్రిల్ 07 (మన వార్త)**నిజామాబాద్ జిల్లా సిరికొండలోని కిడ్స్ పార్క్ పాఠశాలలో భావోద్వేగ వాతావరణం నెలకొంది. పాఠశాల కరస్పాండెంట్ జాకీర్ హుస్సేన్ మరణానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సేవలను స్మరించుకున్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని లక్ష్యంగా పెట్టుకున్న ఆయన, 2019లో పాఠశాలను స్థాపించి దాదాపు 30 మందికి ఉచిత విద్య అందించారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సేవా భావంతో ముందుకు సాగారు. సాధారణ కుటుంబంలో జన్మించిన ఆయన కష్టాలను జయిస్తూ ఉపాధ్యాయుడిగా ఎదిగి, విద్యార్థులకు విద్యతో పాటు విలువలను బోధించారు. ఆయన మరణం పాఠశాల కుటుంబానికి తీరని లోటుగా మారింది. ఆయన చూపిన మార్గంలోనే ముందుకు సాగుతాం అని ఉపాధ్యాయులు తెలిపారు. సేవా తపనతో జీవించిన జాకీర్ హుస్సేన్ జ్ఞాపకాలు చిరస్థాయిగా నిలిచిపోతాయి.

## రాజన్న సిరిసిల్ల జిల్లా శాంతి భద్రతల పరిరక్షణ కొరకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం




**ఎల్లారెడ్డి పేట ఏప్రిల్ 07 :(మన వార్త ప్రతినిధి)** అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి.సరైన పత్రాలు లేని 23ద్విచక్ర వాహనాలు,15 లీటర్ల మద్యం స్వాధీనం.సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి.శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా ఎస్పీ గారి ఆదేశానుసారం మంగళవారం రోజున ఉదయం సిరిసిల్ల పట్టణంలోని సిక్ వాడలో డీఎస్పీ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సరైన పత్రాలు,నంబర్ ప్లేట్లు లేని 23 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.అలాగే నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న బోయిని శ్రీనివాస్, బల్విర్ సింగ్ చందర్ సింగ్‌లపై కేసులు నమోదు చేసి 14 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు.ప్రజల రక్షణతో పాటు వారికి భద్రతాభావం (Sense of Security) కల్పించడం, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రాంతాల్లోకి కొత్తగా వచ్చే వ్యక్తులు లేదా నేరస్తులు షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయాలు కూడా గుర్తించే అవకాశం ఉంటుందన్నారు..ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుపై దృష్టి పెట్టేలా ప్రోత్సహించాలని సూచించారు.గంజాయి అక్రమ రవాణా, నిల్వ, సరఫరా వంటి అంశాలపై ఎవరైనా సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు.ఈకార్యక్రమంలో పట్టణ సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ లు శ్రీకాంత్,ఉపేందర్ ఆర్.ఎస్.ఐ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు

## విద్యుత్ సమస్యలు తీర్చడమే మా కర్తవ్యం సెస్ ఎ ఇ. పృథ్వీధర్ గౌడ్




**ఎల్లారెడ్డి పేట ఏప్రిల్ 07: (మన వార్తా ప్రతినిధి )** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్ గ్రామంలో మంగళవారం ప్రజా బాట కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని సమస్యలను సెస్ ఎ ఇ, బుర్ర పృథ్వీధర్ గౌడ్, పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ పి డి సి ఎల్ ఎస్ సి ఈ బిక్షపతి ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో సమస్యల పట్ల అవగాహన కల్పించి పరిష్కరించడం జరుగుతుందన్నారు క్షేత్రస్థాయిలో విద్యుత్ స్తంభాలు లేనియెడల ఆ ప్రాంతంలోని వారు ఒక విద్యుత్ మీటర్ కు డబ్బులు కడితే అక్కడి వరకు విద్యుత్తు లైన్ ను సమకూరుస్తామన్నారు ఈ డబ్బులు కట్టడం మీ సేవలో కట్టాలని అంతా ఆన్లైన్ విధానంలో ఉంటుందని అన్నారు గ్రామంలో లో వోల్టేజి సమస్య తీర్చడానికి ఒక ట్రాన్స్ఫార్మర్ అవసరమని కొన్ని వార్డుల్లో విద్యుత్ స్తంభాలు అవసరమని నారాయణపూర్ సర్పంచ్ దొమ్మాటి నర్సయ్య,విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు ప్రజా బాటలో కార్యక్రమంలో భాగంగా. ఎస్ ఎస్ 15 విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఆధునికరించారు ఈ కార్యక్రమంలో. ఉప సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, లైన్ ఇన్స్పెక్టర్ రమేష్. లైన్ మెన్ ప్రవీణ్ విద్యుత్ సిబ్బంది నాయకులు గోగుర్ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## రేషన్ దుకాణాన్ని తనిఖీ చేసిన ఆర్డిఓ రమాదేవి...



**చిన్న శంకరంపేట ఏప్రిల్ 7 ( మన వార్త ప్రతినిధి )**చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని మెదక్ ఆర్డిఓ రమాదేవి తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు, అనంతరం తహసిల్దార్ మాలతితోపాటు కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి భూభారతి, సాదాబైనామ, భూ రి సర్వే, అక్రమ ఇసుక, తరలింపు లపై పలు సూచనలు తెలియజేశారు, అనంతరం మండల కేంద్రంలోని రేషన్ దుకాణాన్ని తనిఖీ చేసి సన్న బియ్యాన్ని పరిశీలించారు, ఈ సందర్భంగా ఆర్డీవో రమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వం మూడు నెలలకు సరిపడా సన్నబియ్యం సరఫరా చేయడం జరిగిందని లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు, రెవెన్యూ కార్యాలయంలో భూభారతి, సాదాభైనామ, ప్రజావాణి, కి సంబంధించిన ఫైలు పెండింగ్లో ఉంచకూడదని వెంటనే వాటిని పరిష్కరించాలని తెలిపారు, అక్రమ ఇసుక తరలిస్తే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు, ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మాలతి ఆర్ఐ రాజు తో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## రెండవ రోజు కొనసాగిన గుడ్ మార్నింగ్ శంకరంపేట..



**చిన్న శంకరం పేట ఏప్రిల్ 7( మన వార్త ప్రతినిధి )**చిన్న శంకరంపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని పదవ వార్డు గాంధీనగర్ కాలనీలో స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్ గుడ్ మార్నింగ్ శంకరంపేట కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు పర్యటించారు, వార్డు సభ్యురాలు స్వరూపతో కలిసి వార్డులో తిరిగి సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు, ముందుగా వాటర్ మెన్ గా నల్లాల గేటాఖ్వీల్ ద్వారా నీళ్లు విడుదల చేసి వార్డులో పర్యటించారు వార్డు ప్రజలతో మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో ఉన్న పలు సమస్యలను ప్రజలు ఆయన దృష్టి తీసుకుపోయారు, వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, డ్రైనేజ్ కూడా కావాలని నీటి సమస్య కూడా ఉన్నదని, ప్రజలు ఆయన దృష్టికి తీసుకుపోయారు, ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజలకు సరిపడా నీరు రావడం జరుగుతుందని నేటి సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని నీరు వృధా కాకుండా నల్లాలకు ఆన్ ఆఫ్ పెట్టుకోవాలని మీరు సరిపోగానే నల్లాలు ఆఫ్ చేసుకోవాలని ఆయన ప్రజలకు తెలిపారు నల్లా వచ్చే సమయంలో ఎవరు కూడా మోటర్లు పెట్టుకోకూడదని వేసవికాలం దృష్టిలో పెట్టుకొని నీరు వృధా చేసుకోకూడదని ఆయన తెలిపారు సర్పంచ్ చంద్రశేఖర్ తో పాటు వార్డు సభ్యురాలు స్వరూప కాలనీవాసులు పాల్గొన్నారు.

## బల్మూర్ వెంకట్‌కు దేవస్థానం సత్కారం..



**ఇల్లందకుంట, ఏప్రిల్ 07 (మన వార్త ప్రతినిధి):**అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగుతున్న వేళ, స్వామివారి సేవలో భాగస్వామ్యులైన దాతలను దేవస్థానం ప్రత్యేకంగా సత్కరిస్తోంది. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలకు పట్టు వస్త్రాలను సమర్పించి, తన అనుచరులతో కలిసి తలంబ్రాలు పంపించిన ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్‌ను ఆలయ అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ క్రమంలో తలంబ్రాల సమర్పణకు గాను దేవస్థానం తరపున గుర్తింపుగా మెమెంటోను అందజేశారు. ఆలయ అర్చకులు స్వామివారి ఆశీర్వాదాలతో డాక్టర్ బల్మూర్ వెంకట్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో చింతల శ్యామ్ సుందర్ రెడ్డి బాబాజీ నాగరాజు, సింగిరెడ్డి రంజిత్ రెడ్డి, , అనిల్ రెడ్డి, కిషోర్ తదితరులు కలిసి స్వామివారి మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ, ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి సేవలో భాగస్వామ్యం కావడం తనకు గొప్ప అదృష్టమని అన్నారు. భవిష్యత్తులో కూడా దేవస్థానం కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. దేవస్థానం అధికారులు మాట్లాడుతూ, భక్తుల సహకారంతోనే బ్రహ్మోత్సవాలు మరింత వైభవంగా నిర్వహించగలుగుతున్నామని, సేవాభావంతో ముందుకు వస్తున్న దాతలను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు.

## సమయపాలన పాటించేందుకే బయోమెట్రిక్ హాజరు విధానం

**-పట్టణ పరిశుభ్రత విషయంలో రాజీపడేది లేదు...**

**-బయోమెట్రిక్ విధానాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ సామినేని సుజాత....**

**మధిర, ఏప్రిల్ 7( మన వార్త):**ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ మధిర పట్టణ పరిశుభ్రత విషయంలో రాజీపడేది



లేదని మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం 5 గంటలకి పాశుద్ధ కార్మికుల బయోమెట్రిక్ విధానాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత పరిశీలించి పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడారు. మధిర మున్సిపాలిటీలలో పారిశుధ్య, ఇతర సిబ్బంది హాజరును పకడ్బందీగా నమోదు చేసేందుకు,అవినీతిని అరికట్టేందుకు,సమయపాలన పాటించేందుకు బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేయటం జరిగిందని తెలిపారు. బయోమెట్రిక్ హాజరు విధానంలో ఉదయం,సాయంత్రం రెండు పూటలా పారిశుద్ధ కార్మికుల వేలిముద్ర ద్వారా హాజరును రికార్డ్ చేస్తుంది..అలాగే వారి జీతాలతో అనుసంధానించబడి ఉంటుంది అని అన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకే పారిశుధ్య కార్మికులు,అధికారులు నిరంతరం కృషి వెయ్యాలి అని అన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన మెదక్ ఆర్డిఓ రమాదేవి



**చిన్న శంకరంపేట ఏప్రిల్ 7 ( మన వార్త ప్రతినిధి )** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఆరోగ్య వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని మెదక్ ఆర్డిఓ రమాదేవి అన్నారు. చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మెదక్ ఆర్ డి ఓ తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు, వైద్య పరీక్షల నిమిత్తం ఆరోగ్య కేంద్రానికి వచ్చిన వారితో ఆమె మాట్లాడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్నటువంటి వైద్య సేవల గురుంచి అడిగి తెలుసుకున్నారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ప్రజలంతా కూడా వైద్య పరీక్షలు చేయించుకొని ఆరోగ్యంగా ఉండాలని మెదక్ ఆర్డీవో రమాదేవి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ఆరోగ్య వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని వారం రోజులపాటు ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేసి మందులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవితో పాటు తహశీల్దార్ మాలతి, మండల వైద్యాధికారి సాయి సింధు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ లు రాజు, వినయ్, ఏఎన్ఎం లు, ఆశ వర్కర్లు, పీహెచ్సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసిన అన్ని శాఖల అధికారులకు కృతజ్ఞతలు

**-ఆలయ చైర్మెన్ ఇంగిలే రామారావు...**

**ఇల్లందకుంట,07 ( మన వార్త ప్రతినిధి):** శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల సందర్భంగా 13 రోజుల



కార్యక్రమంలో భాగంగా ప్రజలకు భక్తులకు సహకరించిన అన్ని శాఖల అధికారులకు కృతజ్ఞతలు అని ఆలయ చైర్మెన్ ఇంగిలే రామారావు తెలిపారు .జమ్మికుంట కాటన్ మిల్లర్స్, పారాబోయిల్డ్ రైస్ మిల్లర్స్, రా రైస్ మిల్లర్స్ అన్నదాన కార్యక్రమం,అన్ని శాఖల అధికారులకు జిల్లా యంత్రాంగానికి,పోలీస్ శాఖ, ఆర్ అండ్ బి, ఆరోగ్యశాఖ,=ుజ యాజమాన్యం, రెవెన్యూ శాఖ 108,మున్సిపాలిటీ అధికారులు, పారిశుద్ధ కార్మికులు, 18గ్రామాల గ్రామపంచాయతీ సిబ్బంది, దేవస్థానం అధికారులు,అర్చకులు, సిబ్బంది, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులందరికి కృతజ్ఞతలు అలాగే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించిన పోలీస్ వారికి వారి కుటుంబానికి ఆ సీతారామచంద్ర స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా మా పాలకవర్గం తరపున కోరుకుంటున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మెన్ ఇంగిలే రామారావు ధర్మకర్తలు గోలి కిరణ్, గోడిశాల పరమేష్, కారింగుల రాజేందర్, సింగిరెడ్డి గోపాల్, కురిమిండ్ల చిరంజీవి,ఎడ్ల కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన తహసిల్దార్ మాలతి...



**చిన్న శంకరంపేట ఏప్రిల్ 7 ( మన వార్త ప్రతినిధి )**చిన్న శంకరంపేట మండలం గవ్వల పల్లి గ్రామంలోని ఎరువుల దుకాణాలను తహశీల్దార్ మాలతి ఆకాశపు గంగ తనిఖీ చేశారు, దుకాణంలోని పలు రికార్డులను ఆమె పరిశీలించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులను అందజేయాలని అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే దుకాణదారులపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు, రైతు ఎరువులు క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరి బిల్లులు తీసుకోవాలని, దుకాణ యజమానులు ఎవరైనా అధిక ధరలకు విక్రయించిన సమాచారం అందించాలని రైతులకు తహశీల్దార్ మాలతి సూచించారు ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మాలతి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

# బెట్టింగ్ బారిన పడకండి..!

**-యువతకు ఇల్లంతకుంట సర్పంచ్ మామిడి రాజు హెచ్చరిక...**



**ఇల్లంతకుంట,ఏప్రిల్ 07 (మన వార్త ప్రతినిధి);**ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు యువత భవిష్యత్తును నెమ్మదిగా మింగేస్తున్న ప్రమాదకర వ్యసనంగా మారుతున్నాయని ఇల్లంతకుంట సర్పంచ్ మామిడి రాజు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.మండలంలోని పలు గ్రామాల్లో ఈ మోజు రోజురోజుకు పెరుగుతూ యువకులను తప్పుదోవ పట్టిస్తూ కుటుంబాలను ఆర్థికంగా,మానసికంగా కుదేలు చేస్తున్నదని ఆయన పేర్కొన్నారు.సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో బెట్టింగ్ యాప్‌లకు ఆకర్షితులవుతున్న యువత చివరకు అప్పుల బారిన పడుతూ,జీవితాలను తామే నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.క్షణిక లాభాల కోసం తీసుకునే ఈ ప్రమాదకర నిర్ణయాలు వారి భవిష్యత్తును చీకట్లోకి నెడుతున్నాయని హెచ్చరించారు.యువత చెడుదారిలోకి వెళ్లకుండా సమాజం మొత్తం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని,ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిశితంగా గమనిస్తూ,మొబైల్ వినియోగంపై నియంత్రణ పెట్టాలని సూచించారు.చిన్న వయస్సులోనే బెట్టింగ్ మోజుకు లోనుకాకుండా వారిని సరైన దారిలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందని స్పష్టం చేశారు.గతంలో స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో యువతను చెడు అలవాట్ల నుంచి దూరంగా ఉంచేందుకు క్రీడలు,ఆటలు,సామాజిక కార్యక్రమాలపై దృష్టి సారించి అనేక కార్యక్రమాలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు.క్రీడలతోనే యువతలో శారీరక,మానసిక దృఢత్వం పెంపొందుతుందని,అలాంటి మార్గాల్లోనే యువతను ముందుకు నడిపించాలన్నారు.ప్రస్తుతం సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ మండలంలో పెరుగుతున్న బెట్టింగ్ ప్రభావంపై అప్రమత్తం చేస్తూ,యువత భవిష్యత్తు కాపాడటంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

## ముక్తిధామం అభివృద్ధి పనులపై మైనంపల్లి హనుమంతరావు సమగ్ర సమీక్ష




**-1.90 కోట్ల పనుల పురోగతిపై అధికారులకు ఆదేశాలు, వర్షాకాలానికి ముందే పూర్తి చేయాలని సూచన...**

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఏప్రిల్ 7 మన వార్త** : మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా, డివిజన్ 190 పరిధిలోని తుర్కపల్లి ప్రాంతంలో ఉన్న ముక్తిధామం హిందూ శ్మశాన వాటికలో చేపడుతున్న అభివృద్ధి పనులను మల్కాజిగిరి ఇన్‌చార్జ్ మైనంపల్లి హనుమంతరావు, మాజీ కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ ప్రత్యక్షంగా పరిశీలించారు. జిహెచ్‌ఎంసి అధికారులతో కలిసి నిర్వహించిన ఈ పరిశీలనలో,సుమారు 1.90 కోట్ల వ్యయంతో కొనసాగుతున్న వివిధ మౌలిక సదుపాయాల పనుల పురోగతిని ఆయన సమగ్రంగా సమీక్షించారు.శ్మశాన వాటిక అభివృద్ధి కోసం చేపట్టిన పనుల్లో పైప్‌లైన్ వ్యవస్థలు, తాగునీటి సదుపాయం, దహన వేదికల నిర్మాణం, ధ్యాన మందిరం ఏర్పాటు, అస్తికల గది నిర్మాణం, కంపౌండ్ వాల్ అభివృద్ధి, బోర్‌వెల్ సదుపాయాలు తదితర అంశాలు కీలకంగా ఉన్నాయి. ఈ పనుల నాణ్యత, వేగం, వినియోగదారులకు కలిగే సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.పరిశీలన సందర్భంగా అక్కడి ప్రస్తుత పరిస్థితులను అధికారులతో కలిసి సమీక్షించిన మైనంపల్లి హనుమంతరావు, పనులలో ఎలాంటి ఆలస్యం లేకుండా నిర్దిష్ట గడువులో పూర్తిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో, శ్మశాన వాటికలో అవసరమైన బాత్‌రూమ్ సదుపాయాల నిర్మాణాన్ని అత్యవసరంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.అలాగే శ్మశాన వాటికకు వచ్చే ప్రజలకు కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండేలా అన్ని మౌలిక సదుపాయాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. ప్రజల భావోద్వేగాలకు సంబంధించిన స్థలమైన శ్మశాన వాటికలో పరిశుభ్రత, నీటి సౌకర్యం, భద్రత వంటి అంశాలు అత్యంత ప్రాధాన్యత కలిగి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.ఈ పరిశీలన కార్యక్రమంలో అల్వాల్ సర్కిల్ డీసీ భోగేశ్వరులు, డీఈ ప్రశాంతి, ఏఈ రవళి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొని పనుల పురోగతిపై వివరణ ఇచ్చారు. అలాగే శ్మశాన వాటిక కమిటీ సభ్యులు జి.ఆనంద్ రెడ్డి, రామచందర్ రెడ్డి, లడ్డూ రెడ్డి, శంకర్ యాదవ్, కృష్ణ తదితరులు హాజరై స్థానిక సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు.మొత్తానికి, ముక్తిధామం శ్మశాన వాటిక అభివృద్ధి పనులపై జరిగిన ఈ సమీక్ష కార్యక్రమం స్థానిక ప్రజల్లో ఆశలు నింపింది. పనులు త్వరితగతిన పూర్తి అయితే, ప్రాంత ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు.

## త్రైత శకం 48 కాలసూచిక ఆవిష్కరణ...

**-ఆవిష్కరించిన ఆర్ టీ ఐ జాతీయ చైర్మన్ చంటి ముదిరాజ్,రాష్ట్ర అధ్యక్షులు స్రవంతి...**

**ఎల్కతుర్తి ఏప్రిల్ 07 మన వార్త ప్రతినిధి** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం ఇందు్జ్ఞన వేదిక ప్రబోధ సేవ సమితి అధ్యకులు సదానిరంజన్ సిద్ధాంతి మాట్లాడుతూ... హైదరాబాద్ రవీంద్రభారతిలో సమాచార హక్కు చట్ట సాధన కమిటీ జాతీయ అధ్యక్షులు చంటి ముదిరాజ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులతో కలిసి త్రైత శకం 48 కాలసూచికను ఆవిష్కరించారు అని హిందూ జ్ఞాన వేదిక ప్రభుదా సేవా సమితి ఎల్కతుర్తి శాఖ అధ్యక్షులు సదానిరంజన్ సిద్ధాంతి తెలిపారు.ఆధ్యాత్మిక విషయాల సమగ్ర వివరణ ఈ సందర్భంగా చంటి ముదిరాజ్ మాట్లాడుతూ, కాలసూచికలో ఆధ్యాత్మిక అంశాలను సరళమైన భాషలో పొందుపరిచినట్లు తెలిపారు. శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు అందించిన జ్ఞానం ఇందులో విశదంగా వివరించబడిందని పేర్కొన్నారు. యుగాది □ ఉగాది వివరణ ప్రత్యేకత జీవాత్మ, ఆత్మ, పరమాత్మల విశిష్టతలను స్పష్టంగా వివరిస్తూ, “యుగాది” అనే పదం “ఉగాది”గా మారిన విధానాన్ని అర్థవంతంగా వివరించారని తెలిపారు.9 తెలుగు సంప్రదాయ కాలమానం ప్రతిబింబం చైత్రమాసం నుండి ఫాల్గుణమాసం వరకు తెలుగు సంప్రదాయ కాలమానాన్ని ప్రతిబింబించే విధంగా ఈ కాలసూచిక రూపొందించబడినందుకు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి శాఖ అధ్యక్షులు సదానిరంజన్ సిద్ధాంతి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్టీఐ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## రాష్ట్రస్థాయి ఉత్తమ గైనకాలజిస్ట్‌గా డాక్టర్ అన్నపూర్ణకు పురస్కారం


**-గజ్వేల్ ఆసుపత్రిలో రికార్డు స్థాయి ప్రసవాలు నిర్వహించినందుకు గౌరవం...**

**-వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా అవార్డు ప్రదానం...**



**గజ్వేల్, ఏప్రిల్ 07 మన వార్త ప్రతినిధి** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య ఆరోగ్య రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన వారికి అందజేసే రాష్ట్రస్థాయి పురస్కారాలలో భాగంగా, గజ్వేల్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని స్వీకరించారు. డాక్టర్ అన్నపూర్ణ గజ్వేల్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా సేవలు అందిస్తూ, రికార్డు స్థాయిలో అత్యధిక సంఖ్యలో ప్రసవాలు (డెలివరీసు) నిర్వహించినందుకు గాను ఉత్తమ గైనకాలజిస్ట్ గా ఎంపికయ్యారు. అలాగే సిద్దిపేట జిల్లాలో డి.సి.హెచ్.ఎస్ మెడికల్ సూపరింటెండెంట్‌గా ఆమె అందించిన అత్యుత్తమ సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం ఈ పురస్కారాన్ని అందించింది. ఈ సందర్భంగా డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ ఈ అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ పురస్కారం కేవలం నా ఒక్కరి కృషి వల్ల సాధ్యం కాలేదని, ఆసుపత్రిలో పనిచేసే వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్స్, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, పారామెడికల్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది ఇలా ప్రతి ఒక్కరి సహాయ సహకారాలు, సమిష్టి కృషి వల్లే ఈ గుర్తింపు లభించిందన్నారు. వారందరికీ ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. రాష్ట్రస్థాయి అవార్డు రావడం వల్ల తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. భవిష్యత్తులో మరింత కష్టపడి పనిచేస్తానని, సిద్దిపేట జిల్లాను వైద్య ఆరోగ్య రంగంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు.

## పశువుల పాకల నిర్మాణానికి చెక్కుల పంపిణీ...



**-అనంతారం గ్రామంలో 8 మంది రైతులకు లబ్ధి...**

**ఇల్లంతకుంట,ఏప్రిల్ 07 (మన వార్త ప్రతినిధి);**ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పశువుల పాకలు నిర్మించుకున్న 8 మంది రైతులకు చెక్కులు పంపిణీ చేశారు.గ్రామ సర్పంచ్ వొల్లాల రజిత వెంకటేశం ఆధ్వర్యంలో మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం పశుసంవర్ధక రంగ అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కదం జయంత్,వార్డు సభ్యుడు మల్యాల రాజశేఖర్,పంచాయతీ కార్యదర్శి మారుతి,ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ,రైతులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

**-రక్తదాన శిబిరం ద్వారా 32 యూనిట్ల సేకరణ...**

**-ఆర్.ఎం.వో డాక్టర్ రాము...**




**గజ్వేల్, ఏప్రిల్ 07 మన వార్త ప్రతినిధి** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సిద్దిపేట జిల్లా గజ్వేల్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఆసుపత్రి ఆర్.ఎం.వో డాక్టర్ రాము ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆర్.ఎం.వో డాక్టర్ రాము మాట్లాడుతూ రక్తదానం మహాదానమని, అన్ని దానాల కంటే ప్రాణదానం మిన్న అని పేర్కొన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు, శస్త్రచికిత్సల సమయంలో మరియు ప్రసవ సమయాల్లో రక్తం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, అటువంటి వారిని కాపాడటానికి ఇలాంటి శిబిరాలు ఎంతో దోహదపడతాయని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేమని, కేవలం దానం ద్వారానే సేకరించగలమని చెబుతూ, రక్తదానం సురక్షితమైనదని మరియు ఆరోగ్యకరమైనదని ఆయన అవగాహన కల్పించారు. నేటి శిబిరంలో మొత్తం 32 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కుమార్ స్వామి మాట్లాడుతూ ప్రజల్లో రక్తదానంపై ఇంకా అవగాహన పెరగాలని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ తరపున రక్తదాతలకు పండ్లు, జ్యూస్ పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎం.వో-2 డాక్టర్ ప్రణీత, బ్లడ్ బ్యాంక్ ఇన్చార్జ్ డాక్టర్ భవాని, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సుమన్, హెల్త్ ఇన్స్పెక్టర్ లక్ష్మి, హెడ్ నర్సులు ఉమామహేశ్వరి, రోజులిన్, బ్లడ్ బ్యాంక్ ఇన్చార్జ్ దేవేందర్, నర్సింగ్ ఆఫీసర్లు బాలకిషన్, శ్రీనివాస్, నవీన్, ల్యాబ్ టెక్నీషియన్లు రాజు, కరుణాకర్, గౌతమ్, మహేందర్, నజీర్ అహ్మద్, హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్, ఆరోగ్యమిత్ర సురేందర్, జిల్లా పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు గాడిపల్లి అనూప్, గజ్వేల్ యువజన సంఘం అధ్యక్షులు తలకొక్కుల ప్రేమ్ కుమార్, అపర్ణ హస్తం ప్రధాన కార్యదర్శి కటుకం శ్రీనివాస్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు దొంతుల సత్యనారాయణ, దూబకుంట లచ్చాలు, శానిటేషన్ సూపర్వైజర్ శేఖర్, ఇతర పారామెడికల్, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# రేపాకలో చలివేంద్రం ఏర్పాటు...



**-మౌల్వి ముంషాద్ హైమద్ ఆధ్వర్యంలో బాటసారులకు చల్లటి నీరు...**

**ఇల్లంతకుంట,ఏప్రిల్ 7 (మన వార్త ప్రతినిధి);**వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇల్లంతకుంట మండలంలోని రేపాక గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు.గ్రామానికి చెందిన జామ మస్జీద్ మౌల్వి ముంషాద్ హైమద్ ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా బాటసారులకు చల్లటి నీరు అందించేందుకు ముందుకు వచ్చారు.మంగళవారం రేపాక గ్రామ బస్ స్టాప్ ఆవరణలో చలివేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఎండాకాలంలో దప్పిక తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయుక్తమని తెలిపారు.మంచి పనులు చేయడంలో కుల,మత భేదాలు అడ్డుకావని,గత సంవత్సరంలాగే ఈసారి కూడా గ్రామ ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.గ్రామ ప్రజలు,ముస్లిం సమాజానికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,ప్రజలు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికులకు వేసవి సెలవుల్లో వేతనం ఇవ్వాలి...

**మధిర,ఏప్రిల్ 7( మన వార్త):**మధ్యాహ్న భోజన వంట కార్మికులకు వేసవి సెలవుల్లో వేతన ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకులు మద్దాల ప్రభాకర్ డిమాండ్ ... ఎర్రుపాలెం మండల కేంద్రం రామిశెట్టి పుల్లయ్య భవనం నందు సిఐటియు అనుబంధ సంఘం మధ్యాహ్న భోజన కార్మికుల చింతిరాల దేవకరణ అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సదర్భంగా మద్దాల ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంట కార్మికులు వేలాది మంది గత 24 సంవత్సరాలుగా అతి తక్కువ వేతనం ఇస్తూ ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుంటూ కనీసం వేసవి సెలవుల్లో కూడా వేతన ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని విమర్శించారు..సుదీర్ఘ కాలంగా వంట కార్మికుల యొక్క సమస్యలు పరిష్కారంచేటంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆయన విమర్శించారు. అనేక పోరాటాల ఫలితంగా వంట కార్మికులకు వెయ్యి నుండి రెండు వేల వేతనం సాధించుకోవటం జరిగిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడితే వంట కార్మికులకు 10వేల వేతనం ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేసారు. వంట కార్మికులకు సామాజిక భద్రత కల్పించే పిఎఫ్, ఈ.ఎస్.ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని, ప్రమాద బీమా పథకం వర్తింప చేయాలని, గతంలో అల్పాహారం చేసిన బిల్లులు, పారితోషిక బకాయిలను సత్వరం చెల్లించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం భోజన వంట కార్మికులకు కోడి గుడ్లను, నిత్యావసర వస్తువులను ప్రభుత్వమే ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విజయ,లక్ష్మి, శాంత కుమారి పార్వతి, తదితర కార్మికులు పాల్గొన్నారు

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన ఎన్ సీ సంతోష్



**గజ్వేల్ ఏప్రిల్ 07 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ లో కార్మికులుగా.విధులు నిర్వహిస్తున్న మైస స్వామి,నర్సింలు తండ్రి మైసయ్య అకాల మరణం చెందగా విషయం తెలుసుకున్న.బి ఆర్ ఎస్ యువ నాయకుడు సిద్దిపేట జిల్లా కబడ్డి అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ సీ సంతోష్ మృతుని కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యం కల్పించి తక్షణ సహకారం కొంత ఆర్థిక సహాయం అందజేశారు

## రేషన్ దుకాణాలను తనిఖీ చేసిన తహసీల్దార్ గ్రేసీ బాయి...



**నార్సింగి ఏప్రిల్ 7 ( మన వార్త ప్రతినిధి )**నార్సింగి మండలం లోని అన్ని రేషన్ దుకాణాలలో మూడు నెలల బియ్యం టోకెన్ పద్ధతి ద్వారా సజావుగా సాగుతుందని తహసీల్దార్ గ్రేస్ బాయి తెలిపారు. మంగళవారం తహసీల్దార్ గ్రేస్ బాయి, కార్యాలయ సిబ్బంది తో పాటు మండలం లో విస్తృతంగా పర్యటిస్తూ పలు అంశాల పై తనిఖీ నిర్వహించారు. నార్సింగి, వల్లూరు, జప్తి శివనూరు, శంఖాపూర్ గ్రామాల లోని రేషన్ దుకాణాలను తనిఖీ చేసి స్టాకు రిజిస్టర్, బియ్యం పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ప్రభుత్వం తరపున రేషన్ కార్డు దారులకు ఈ నెలలో మూడు నెలల కు సంబంధించి బియ్యం సరఫరా చేస్తున్నారని, మండలం లోని అన్ని రేషన్ దుకాణాలలో మూడు నెలలకు సరిపడా బియ్యం సరఫరా జరిగిందని తెలిపారు. రేషన్ డీలర్లు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరతగతిన, టోకెన్ పద్ధతి లో మాత్రమే బియ్యం సరఫరా చేయాలని తెలిపారు. సరఫరా లో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) జనాభా లెక్కలు 2027 కోసం వల్లూరు గ్రామంలో హౌస్ లిస్టింగ్ బ్లాక్స్ (హెచ్.ఎల్.బీ) చేయడం కోసం ఆర్.ఐ, ఏ.ఎస్.ఓ పంచాయతీ కార్యదర్శి, జీ.పీ.ఓ, బీ.ఎల్.ఓ లతో పాటు క్షేత్ర స్థాయి పరిశీలన పరిశీలన నిర్వహించారు. జనాభా లెక్కల ప్రక్రియ సజావుగా సాగడానికి, ఏ ఇల్లు వదలకుండా, ప్రతీ ఇంటి వరకు సిబ్బంది వెళ్లి అన్ని వివరాలను నమోదు చేయడానికి వీలుగా ఇండ్లను బ్లాకుల వారిగా విభజిస్తున్నారని తెలిపారు. పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జరుగుతున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. పరీక్షకు హాజరుతున్న విద్యార్థుల వివరాలు, అందిస్తున్న సౌకర్యాలు, పరీక్షా సరళి ని ఈ సందర్భంగా పర్యవేక్షించారు. అనంతరం పట్టణ కేంద్రం లోని అగ్రోస్ రైతు ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తూ రిజిస్టర్ లో నమోదు ఉన్న స్టాకు నిలువ ఉన్న స్టాకు ను పరిశీలించారు. రైతులకు అవసరమైన యూరియా, ఫెర్టిలైజర్, మందులు విక్రయించి నప్పుడు ఖచ్చితంగా రసీదు ఇవ్వాలని, స్టాక్ రిజిస్టర్ ను పక్కాగా నిర్వహించాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా విక్రయించాలని సూచించారు.

## ఇష్టపడి చదివినప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారు

**-అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్పీ రాంబాబు...**

**చేగుంట ఏప్రిల్ 7 ( మన వార్త ప్రతినిధి)** చేగుంట మండలంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల




చందాయిపేటలో రోల్ మోడల్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చందాయిపేట పూర్వ విద్యార్థి డాక్టర్ ఎస్.పి రాంబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివినప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారని, విద్యార్థులు ఏకాగ్రతతో, ఓపికతో చదివినప్పుడే విద్యార్థులకు చదువు అర్థమవుతుందని వారు అన్నారు. నేను కూడా ఇదే పాఠశాలలో తెలుగు మీడియం లో చదివి ఎంబిబిఎస్ సీటు సాధించి, గాంధీ హాస్పిటల్ లో అసోసియేట్ ప్రొఫెసర్, సివిల్ సర్జన్ గా విధులు నిర్వహిస్తున్నానని, మీరు కూడా కష్టపడి చదివితే నాకంటే మీరు ఉన్నత స్థాయిలో ఉంటారని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు విఠల్ రెడ్డి, నర్సింలు, సౌజన్య, స్వప్న, దామోదర్, శంకర్, సలీం, శ్రీనివాస్,రాములు, యాదగిరి, బంగారయ్య, పూర్వ విద్యార్థులు సాయిబాబా, సిద్ధిరాములు, చల్లా లక్ష్మణ్, చల్లా రామకృష్ణ, మోజామిల్, తదితరులు పాల్గొన్నారు

## కందికట్కూరు ఉప మండల హిందూ సమ్మేళనానికి కమిటీ నియామకం..

**-ఏప్రిల్ 19న సమ్మేళనం నిర్వహణకు సన్నాహాలు...**

**ఇల్లంతకుంట,ఏప్రిల్ 07 (మన వార్త ప్రతినిధి);**కందికట్కూరు ఉప మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో



హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహణ కోసం వివిధ గ్రామాల నుండి వచ్చిన సభ్యులతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ఖండ జాగరణ సమితి సభ్యులు బత్తిని ఆంజనేయులు,కాసుపాక కిషన్,చల్లా సాగర్ పాల్గొన్నారు.ఉప మండలంలోని ఎనిమిది గ్రామాలకు చెందిన కార్యకర్తలు హాజరైన ఈ సమావేశంలో హిందూ సమ్మేళనం విజయవంతం కోసం నిర్వహణ సమితిని ఏర్పాటు చేశారు.సమితి అధ్యక్షుడిగా కందికట్కూరు గ్రామానికి చెందిన వటకూరి నరేందర్‌ను,ప్రధాన కార్యదర్శిగా వల్లంపట్ల గ్రామానికి చెందిన కట్ట శ్రీకాంత్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి సమితి ఉపాధ్యక్షులు, కార్యదర్శులు,కోశాధికారి,కార్యవర్గ సభ్యులను నియమించారు.హిందూ సమ్మేళనం ఈ నెల 19న ఆదివారం సాయంత్రం 5 గంటలకు శేషాద్రి గార్డెన్ సమీపంలోని స్థలంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సమ్మేళనానికి హిందూ బంధువులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో హిందూ సమ్మేళన నిర్వహణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

## సరోజిని కాంట్రాక్టు బేసి కింద ఆరుగులని తొలగింపు

**రాజన్న సిరిసిల్ల జిల్లా** గంభీరావుపేట మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గవర్నమెంట్ హాస్పిటల్ లోరాజన్న సిరిసిల్ల జిల్లా జీగంభీరావుపేట మండల కేంద్రంలో గవర్నమెంట్ హాస్పిటల్ లో సరోజినీ కాంట్రాక్ట్ బేసిక్ కింద 12 మంది కార్మికులను గత నాలుగు సంవత్సరాల క్రితం పనిలోకి తీసుకొని వారిని ఇలాంటి సమాచారం ఇవ్వకుండా ఆరుగురిని శానిటేషన్ కార్మికులను విధుల నుండి తొలగించారు. పనిచేసే వ్యక్తుల్ని ఇలాంటి నోటీసులు ఇవ్వకుండా ఎలా తీసివేశారు. సరోజినీ కాంట్రాక్ట్ అడగక గవర్నమెంట్ ఆరుగురిని తీసుకోవాలని తెలిపారు. అందుకే ఆరుగురిని వీటి నుండి తొలగించామని తెలిపారు. వారు వెంటనే జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు మాకు హాస్పిటల్లో పని కల్పించాలని ఆసుపత్రి ముందు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత మండల వైద్యాధికారి సృజన్ కుమార్ వివరణ కోరగా శానిటేషన్ సిబ్బంది తో మాకు ఎలాంటి సంబంధం లేదని సరోజిని కాంట్రాక్టర్ కు సంబంధించిందనిబి తెలిపారు గతంలో 30 పడకల ఆసుపత్రికి శానిటేషన్ కింద పన్నెండు మందిని వీధుల్లోకి తీసుకోగా అందులో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు 15 పడగల ఆసుపత్రిగా ఉండడం 30 పడకలు రద్దు కావడంతో ఆరుగురిని తీసుకోవాలని కాంట్రాక్టర్ కు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వగా ఆరుగురిని వీధుల్లోకి రావాలని తెలుపగా మిగతా ఆరుగురిని విధుల్లో తీసేసినట్లు తెలిపారు . ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుండి సరోజిని కాంట్రాక్ట్ కింద 12 మందిని శానిటేషన్ కింద విధుల్లోకి తీసుకొని గంభీరావుపేట వాస్తవ్యులుగా ముగ్గురిని తీసుకోగా 9 మంది చుట్టుపక్క గ్రామాల నుండి విధుల్లో కాంట్రాక్టర్ తీసుకున్నాడని. గ్రామానికి సంబంధించిన ఆ ముగ్గురు వ్యక్తులను తీసేయడానికి ఏమిటని కాంట్రాక్టర్ను కార్మికులు నిలదీశారు అలాగే గత పది నెలల వేతనాలు ఇవ్వలేదని అన్నారు. సంబంధిత కాంట్రాక్టర్ మాకు విధుల్లోకి తీసుకొని పది నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సంబంధిత కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు

## టీబీ రహిత సమాజం కోసం పాటు పడదాం...

**-చైర్మన్ సామినేని సుజాత, వైస్ చైర్మన్ కోన ధని కుమార్...**

**మధిర, ఏప్రిల్ 7( మన వార్త) :**ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత టీబీ నిర్ధారణ పరీక్షలు



(డిజిటల్ ఎక్స్ రే )క్యాంపును మధిర మున్సిపాలిటీ చైర్మన్ సామినేని సుజాత రామనాథం,వైస్ చైర్మన్ కోన ధనికుమార్,మడుపల్లి వార్డు కౌన్సి లర్స్ శీలం నర్సింహా రెడ్డి, వేమిరెడ్డి లక్ష్మి తులసీ శ్రీనివాస్ రెడ్డి, పిల్లి సునీత డాక్టర్ పృథ్వి తొ కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,కేంద్రం రాష్ట్ర ప్రభుత్వలా సహా కారంతో ఉచితంగా విలువైన హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసి క్షయ అనుమానిత కేసులు కు ఉచితంగా ఎక్స్ రే పరీక్షలు చేయటంహర్షించ దగ్గ విషయం అని అన్నారు.ఈ కార్యక్రమం లోహెల్త్ సూపర్ వైజర్ లంకా కొండ య్య బృందం పలు జబ్బులు పై ప్రపంచం ఆరోగ్య దినం సందర్భంగా వివిధ జబ్బులు చిత్ర పటా లు. ఫ్లెక్సీ చిత్రాలు ప్రదర్శన లాగా ఏర్పాటు చేసి వ్యాదు లు పై కర పత్రాలు పంచి పెట్టినారు.ఈ కార్యక్రమం లో మడుపల్లి బస్తీ దావఖానా వైద్య రాలు డాక్టర్ సుస్మామా,మధిర టీబీ యూనిట్ సిబ్బంది సీనియర్ ట్రీట్మెంట్ సూపర్ వైజర్ సందీప్,ట్రీట్మెంట్ సీనియర్ ల్యాబ్ సూపర్ వైజర్ శివ,ఎక్స్ రే టెక్నీషియాన్ కనకరావు, హెల్త్ అసిస్టెంట్ యస్ నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు

**-ఆరోగ్య శిబిరాన్ని పరిశీలించిన డిఎంహెచ్ఓ శ్రీరామ్...**

**చేగుంట ఏప్రిల్7( మన వార్త ప్రతినిధి)**చేగుంట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



సందర్భంగా డాక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన హెల్త్ క్యాంపులో మెదక్ జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ క్యాంపులో సుమారు 100కు పైగ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయడం జరిగింది. అదేవిధంగా సుమారు 40 మంది రక్త పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ క్యాంపులో డిఎంహెచ్వో శ్రీరామ్ తో పాటు చేగుంట ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ అనిల్ కుమార్, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, స్థానిక ఉపసర్పంచ్ మొహమ్మద్ రఫీ, నాయకులు సంద్రుగు సతీష్, కట్ట శ్రీనివాస్, ఎండి రహీముద్దీన్, మహేష్, వార్డ్ సభ్యులు మురారి ఉదయ్, రాజ్ కుమార్, షేక్ హరీప్, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ రేణుక నాయకత్వంలో పర్ణశాల ఆసుపత్రికి ప్రతిష్టాత్మక అవార్డు

**-డాక్టర్ రేణుక సేవలకు రాష్ట్ర స్థాయి గుర్తింపు...**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దుమ్ముగూడెం ఏప్రిల్ 7. ( మన వార్త ప్రతినిధి ).**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిస్టాత్మక,





ప్రజపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వరల్డ్ హెల్త్ డే సందర్భంగా తెలంగాణ ఆరోగ్య, వైద్య & కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రకటించిన రాష్ట్ర స్థాయి అవార్డులో పర్ణశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిలిచింది. ఈ విజయానికి ప్రధాన కారణంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రమ్ డాక్టర్ రేణుక నాయకత్వం నిలిచిందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను ప్రజలకు చేరువ చేయడంలో డాక్టర్ రేణుక కీలక పాత్ర పోషించారు. గర్భిణీలకు సురక్షిత ప్రసవాలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు, చిన్నారుల పోషకాహారం, కిషోర బాలికల ఆరోగ్య అవగాహనపై విస్తృత కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్యంగా ఆశ్రమ పాఠశాలల్లో బాలికల కోసం నిర్వహించిన ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు మంచి స్పందన పొందాయి.ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెంచేందుకు డాక్టర్ రేణుక పలు అవగాహనా కార్యక్రమాలు చేపట్టి, కమ్యూనిటీ స్థాయిలో వైద్య సేవల వినియోగాన్ని పెంచగలిగారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, ఎఫర్ట్ స్వచ్ఛంద సంస్థతో సమన్వయం చేసుకుంటూ ఆరోగ్య సేవలను విస్తరించడం ఆమె ప్రత్యేకతగా నిలిచింది.ఇటీవల గత నెలలో నీతి ఆయోగ్ బృందం పర్నశాల ఆసుపత్రిను సందర్శించి, అక్కడి ఆరోగ్య సేవల అమలు మరియు అవగాహన కార్యక్రమాలను ప్రశంసించిన విషయం గమనార్హం. ఇది కేంద్ర స్థాయిలో కూడా ఈ కేంద్రం పనితీరుకు గుర్తింపుగా నిలిచింది.పర్నశాల ఆసుపత్రి సాధించిన ఈ అవార్డు జిల్లాలో ఆరోగ్య రంగ అభివృద్ధికి ప్రేరణగా నిలుస్తుందని అన్నారు.

## కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ పథకం పేదలకు ఒక వరం లాంటిది...


**-నార్సింగి సర్పంచ్ సుజాత మల్లేష్ గౌడ్...**

**నార్సింగి ఏప్రిల్ 7( మన వార్త ప్రతినిధి)** కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ ప్రతీ ఆడపిల్లకు ఒక వరం లాంటిదని నార్సింగి



సర్పంచ్ ఆకుల సుజాత మల్లేశ్ గౌడ్ అన్నారు. మండల కేంద్రం లోని రైతు వేదికలో తహసీల్దార్ గ్రేస్ బాయి ఆధ్వర్యంలో నిర్వహించిన కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి సర్పంచ్ఆకుల సుజాత, ఉపసర్పంచ్ యెన్నం రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుజాత, రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ నార్సింగి పట్టణ కేంద్రానికి చెందిన 25 లబ్ధిదారులకు, కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ పంపిణీ చేయడం తమకు ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పేదలకు ఒక వరం లాంటిదని, ఆడ బిడ్డల పెళ్లి కోసం ఎంతో దోహద పడుతుందని అన్నారు. ప్రభుత్వం తరపున వచ్చిన నిధులను వృథా కాకుండా చూసుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని వాడు అంటే నీటిని కూడా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి కి కట్టుబడి ఉన్నదని, ఎన్నికలలో ఇచ్చిన హామీలను అన్నింటినీ అమలు చేస్తుందని అన్నారు. కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను మంజూరు చేసినందుకు లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆకుల మల్లేశ్ గౌడ్, వార్డు సభ్యుడు బాచి స్వామి, ఆర్.ఐ శ్రీధర్, జీపీఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## తోటపల్లి గ్రామ 5గురు వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరిక



**బెజ్జంకి,ఏప్రిల్ 7(మన వార్త ప్రతినిధి )**సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని తోటపల్లి గ్రామానికి చెందిన 5 మంది వార్డు సభ్యులు మానకొండూరు ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది.ఈ సందర్భంగా వార్డు సభ్యులు ముత్త బీరయ్య, దయ్యాల ఐలవ్వ,ఐలయ్య, ఏనుగుల అనిత,అశోక్, నల్లగొండ రాములు, జనగం లక్ష్మి, లక్ష్మయ్యలకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.అనంతరం వారు మాట్లాడుతూ,తోటపల్లి గ్రామ అభివృద్ధి దృష్ట్యా తాము ఐదుగురం కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్,బెజ్జంకి మండల అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు దయ్యాల ఐలేష్, బైర సంతోష్, గుంటి అంజి, గుంటి అశోక్,గుంటి ఓదెయ్య, ఒగ్గు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం...

**-ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి..**

**పెబ్బేరు.ఏప్రిల్07 (మన వార్త ప్రతినిధి)** ఇందిరమ్మ రాజ్యంలో నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెల్తోందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు,కల్యాణ లక్ష్మి చెక్కులు,షాది ముబారక్ చెక్కులను ఎప్పటికప్పుడు అర్హులైన లబ్ధిదారులకు అందిస్తూ వారికి ఎంతో తోడ్పాటును అందిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మంగళవారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కళ్యాణ్ లక్ష్మి,షాదీ ముబారక్, చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో నిరుపేదల అభ్యున్నతి కోసం ఎంతగానో పాటుపడుతుందన్నారు. ఒక్కో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారునికి 5 లక్షల రూపాయలు చెల్లించి వారి సొంతింటి కల నెరవేరుస్తుందని దాంతో ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు లేక నానా ఇబ్బందులు పడిన నిరుపేదలు నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సొంత గూడు ఏర్పాటు చేసుకున్నామని ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. అలాగే రేషన్ కార్డు లేని ప్రతి నిరుపేదకు రేషన్ కార్డు ఇచ్చి వారికి సన్న బియ్యం పంపిణీ చేస్తూ నిరుపేదల ఆకలి తీరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. ఈ సందర్భంగా వనపర్తి నియోజకవర్గం పరిధిలోని 8 మండలాలు,రెండు మున్సిపాలిటీలకు సంబంధించి 178 మంది కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ లబ్ధిదారులకు ఆయన ఒక లక్ష 16 రూపాయల విలువగల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా చెక్కులు పొందిన లబ్ధిదారులు కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్,వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్,మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్,అధికారులు ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు. వనపర్తి పట్టిన కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు



## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను కలిసిన డంప్ యార్డ్ జేఏసీ నాయకులు,మున్సిపల్ పాలకవర్గం



**జమ్మికుంట/ హుజూరాబాద్,ఏప్రిల్ 07( మన వార్త ప్రతినిధి):**వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ద్వారా హుజురాబాద్ ప్రాంతం తీవ్రంగా నష్టపోతుందని,ప్రజల ఆరోగ్యమే కాకుండా సారవంతమైన నేల కలిగిన హుజూరాబాద్,సిర్సపల్లి ప్రాంతం కాలుష్య కోరల్లో చిక్కుకుంటదని హుజూరాబాద్ డంప్ యార్డ్ జేఏసీ నాయకులు,హుజూరాబాద్ మున్సిపల్ పాలకవర్గం అన్నారు. మంగళవారం రోజున సెక్రటేరియట్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చాంబర్ లో కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు,పాలకవర్గం,మున్సిపల్ పరిధిలోని నాయకులతో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై ఇప్పటికే మున్సిపల్ పాలకవర్గం ఈ డంప్ యార్డును వ్యతిరేకిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారని ఆ విషయాన్ని మంత్రికి వివరించారు. వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ వేరే చోటుకు తరలించాలని,ఈ ప్రాంత భవిష్యత్ దృష్టిలో ఉంచుకొని సానుకూల ప్రకటన చేయాలని జేఏసి నాయకులు కోరగా సానుకూలంగా స్పందించిన మంత్రి ఇప్పటికే ఈ విషయంపై ప్రణవ్ నా దృష్టికి తీసుకువచ్చాడని తప్పకుండా ముఖ్యమంత్రితో మాట్లాడి కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు,జేఏసీ నాయకులు,కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు,మున్సిపల్ పరిధి నాయకులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ పరిశీలించిన చైర్మెన్..



**జమ్మికుంట, ఏప్రిల్ 07( మన వార్త ప్రతినిధి):**పట్టణంలోని డంపింగ్ యార్డ్ ను మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ పరిశీలించారు. జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులలోని గృహ నివాసుల నుండి,రోడ్డు ప్రక్కల నుండి సేకరించిన చెత్త, మురికి కాలువల నుండి తిలోలగించిన చెత్త ను మున్సిపల్ సిబ్బంది సేకరించి డంపు చేస్తున్న డంపింగ్ యార్డ్ ను మంగళవారం మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) శానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్, శ్రీకాంత్ కలసి పరిశీలించారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి




**రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ -07 (మన వార్త )**రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలుపై ఏపీఎంలు, ఐకేపీ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, బుక్ కీపర్లకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం శిక్షణ ఇవ్వగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై మాట్లాడారు. గ్రేడ్ ఏ రకం వరి ధాన్యం క్వింటాలుకు రూ. 2,389, కామన్ రకానికి క్వింటాలుకు రూ. 2,369 గా ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో ఈ సీజన్లో దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారని వివరించారు. ఐకేపీ ఆద్వర్యంలో జిల్లాలో ఏర్పాటు చేయనున్న 136 కొనుగోలు కేంద్రాల్లో టెంట్లు వేయించాలని, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని తెలిపారు. తూకం వేసే యంత్రాలు, తేమ శాతం చూపే యంత్రాలు, టార్పాలిన్లు, గన్ని బ్యాగ్స్ సరిపడా సమకూర్చుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అన్ని కొనుగోలు కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు ఇతర వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. సంబంధిత ఏఈఓ ధృవీకరించిన తరువాత కొనుగోలు చేయాలని, కేటాయించిన మిల్లులకు మాత్రమే ధాన్యాన్ని పంపించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు రాకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని తెలిపారు. అన్ని కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల వద్ద రైస్ మిల్లర్లు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు, అధికారుల ఫోన్ నంబర్లు అందుబాటులో ఉండాలని తెలిపారు. హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్డీఓ గీత, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎల్ బుచ్చిబాబు, పౌర సరఫరాల శాఖ డీఎం నర్సింహారెడ్డి, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, ఏపీఎంలు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ టి ఐ సాధన కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా కామిషెట్టి రమేష్ నియామకం..



**జమ్మికుంట, ఏప్రిల్ 07( మన వార్త ప్రతినిధి):**సమాచార హక్కు చట్టం రాష్ట్ర కార్యదర్శిగా జమ్మికుంట మున్సిపల్ పరిధిలో మోత్కులగూడెం కు చెందిన కామిషెట్టి రమేష్ నియమితులయ్యారు. ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్ రమేష్ కు నియామక పత్రాన్ని అందజేశారు. తన పై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జాతీయ,రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సమాచార హక్కు చట్టం పై ప్రజలు అవగాహన కలిపించేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ నియామకం పట్ల పలువురు అభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

# విద్యార్థులు వసతులు సద్వినియోగం చేసుకోవాలి



**వేములవాడ, ఏప్రిల్ -07 (మన వార్త )**ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. వేములవాడ పట్టణంలోని మహాత్మాజ్యోతి బాపూలే బాలికల రెసిడెన్షియల్ విద్యాలయంలో కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాలయం ఆవరణ, తరగతి గదులు, కిచెన్ లో ఆహార పదార్థాలను పరిశీలించారు. మెనూ చార్ట్ పరిశీలించి.. ఏ ఏ వంటకాలు సిద్ధం చేస్తున్నారో తనిఖీ చేశారు. ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, తమ కుటుంబంలో పిల్లలకు ఆహార పదార్థాలు ఎలా సిద్ధం చేస్తారో అలాగే ఇక్కడ విద్యార్థుల కోసం వండాలని ఆదేశించారు. అనంతరం 9వ తరగతి విద్యార్థులతో కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. అన్ని పరీక్షలకు సంబంధించిన టైమ్ టేబుల్ సిద్ధం చేసుకోవాలని, ఏ రోజు ఏ సబ్జెక్ట్ చదవాలో ముందే రాసుకోవాలని, దానికి అనుగుణంగా అన్ని సబ్జెక్టులు చదవడం, రాయడం పూర్తి చేయాలని తెలిపారు. రైటింగ్ కూడా సాధన చేయాలని, వార్షిక పరీక్షల సమయానికి అనుగుణంగా ఇప్పుడు అదే సమయంలో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాసేలా సాధన చేయాలని పేర్కొన్నారు. ఇప్పటి మార్కులు మీరు తర్వాత చదివే ఉన్నత తరగతులకు ఎంతో కీలకమని స్పష్టం చేశారు. విద్యార్థులం దరూ రానున్న పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఏ నేపథ్యం నుంచి వచ్చినా.. ఇప్పుడు ఇష్టపడి సాధన చేయడం.. అన్ని సబ్జెక్టుల్లో రాణించడంతో వారి భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి వివిధ ఉద్యోగాలు, వృత్తుల్లో స్థిరపడాలని, ఉన్నత స్థానాల్లో నిలవాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు.

# పారదర్శకంగా రాజన్న కోడెల పంపిణీ



**వేములవాడ, ఏప్రిల్ - 07 (మన వార్త )**వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి గోశాల కోడెలను అర్హులైన రైతులకు పారదర్శకంగా పంపిణీ చేస్తున్నామని, కోడెలను సంరక్షించి.. సాగు పనులకు వినియోగించుకోవాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. వేములవాడ పట్టణం తిప్పాపూర్ లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి గోశాలలో రైతులకు మంగళవారం కోడెల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా హాజరై రైతులకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ అందజేశారు. ప్రభుత్వ విప్, కలెక్టర్ కు శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఇంచార్జి ఈఓ అంజనారెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న వారి పత్రాలను అధికారులు తనిఖీ చేస్తుండగా, ప్రభుత్వ విప్, కలెక్టర్ పరిశీలించి.. రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగాహొశ్రీ రాజరాజేశ్వర స్వామివారికి కోడెను కట్టే సంస్కృతి వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి సన్నిధిలో ఉందని గుర్తు చేశారు. భక్తుల విశ్వాసానికి ప్రతీక కోడె మొక్కు చెల్లింపు అని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రైతులకు తిప్పాపూర్ గోశాలలోహొ ఉచితంగా స్వామివారి కోడెలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పంపిణీ చేసిన కోడెలను తనిఖీ చేయిస్తామని స్పష్టం చేశారు. కోడెలను పక్కదారి పట్టించి ఇతర అవసరాలకు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం వేములవాడ పరిధిలో అధునాతన సౌకర్యాలతో సువిశాల స్థలంలో గోశాల నిర్మాణానికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. రూ. 150 కోట్లతో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. కోడెలను రైతులు సంరక్షించాలని సూచించారు. కోడెలను తీసుకువెళ్లే రైతులు వాటి సంరక్షణ బాధ్యతను సక్రమంగా పక్కాగా చూసుకోవాలని సూచించారు. వాటిని ఎల్లప్పుడూ అధికారులతో తనిఖీ చేయిస్తామని స్పష్టం చేశారు. గోశాలలో కోడెల సంరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటు న్నామని, గడ్డి, నీరు, అందిస్తున్నామని, దాదాపు 8 కూలర్లు ఏర్పాటు చేయించామని పేర్కొన్నారు. అలాగే జిల్లా పశు వైద్యాధికారి, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నారని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ రాకేష్, ఆర్డీఓ రాధాభాయ్, ఆలయ ఇంచార్జి ఈఓ అంజనారెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ జయంత్ కుమార్, వ్యవసాయ, రెవెన్యూ, ఆలయ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ మేళాకు విశేష స్పందన..

**-ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాబ్ మేళాలో 41 మంది విద్యార్థుల ఎంపిక...**

**జమ్మికుంట, ఏప్రిల్ 07(మన వార్త ప్రతినిధి):**జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజి కళాశాలలో మంగళవారం జరిగిన మెగా జాబ్ మేళాలో 41 మంది విద్యార్థులు పలు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. రమేష్, టీ ఎస్ కే సీ కో- ఆర్డినేటర్ కె. ఉమాకిరణ్ తెలిపారు. కళాశాలలోని టి ఎస్ కే సీ ఆధ్వర్యంలో, ప్రిన్సిపాల్ అధ్యక్షతన మంగళవారం మెగా జాబ్ మేళా నిర్వహించడం జరిగింది. రాష్ట్రంలోని 12 కంపెనీలు ప్రతినిధులు విచ్చేశారు. జాబ్ మేళాకు 150 మంది విద్యార్థులు ఇంటర్వ్యూ లకు హాజరయ్యారు. వారిలో 41 మంది విద్యార్థులు పలు రకాల ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మరో 40 మంది విద్యార్థులు పలు ఉద్యోగాల శిక్షణలకు ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైనా వారిలో అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ గా ఎ.దిలీప్ అనే విద్యార్థితో పాటు మరికొందరు విద్యార్థులు రూ. 2 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అలాగే ప్రొడక్షన్ మేనేజర్ గా రమేష్ అనే విద్యార్థితో పాటు మరికొందరు రూ. 1.80 లక్ష ల ప్యాకేజీకి ఎంపికైయ్యారు. కాగా రూ.1.60 లక్షల నుండి రూ.1.80 లక్షల వరకు వివిధ ప్యాకేజీలలో వివిధ కంపెనీలలో పలు హోదాలలో విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. ఈ మేరకు ఆయా కంపెనీల ప్రతినిధులు ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయా కంపెనీల ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కూడా మెరుగైన విద్యార్థులు ఈ స్థాయిలో పలు ఉద్యోగాలకు ఎంపిక కావడం చాలా గొప్ప విషయమని కొనియాడారు. ఇలాంటి జాబ్ మేళాను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించడం అభినందనీయమని వారు కళాశాల ప్రిన్సిపాలను, అధ్యాపకులను అభినందించారు. ఈ జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు చదవడం చాల అదృష్టంగా భావించాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాలు చేసుకుంటూనే ఉన్నత విద్యను అభ్యసించి మరింత ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ఉద్యోగాలకు ఎంపికైనా విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ doctor కుమార్,రాజేంద్రం, గణేష్,మాధవి, కిరణ్ కుమార్,ఎంబాడి రవి, శ్రీనివాస్ రెడ్డి,రవీందర్, సుష్మ, రవిప్రకాశ్ రావు,మమత, శ్రీనివాస్, శ్రీకాంత్, రమేష్, ప్రశాంత్, సాయికుమార్, అనూష, అరుణ్ రాజ్, స్వప్న , దీనా, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




## పోగొట్టుకున్న ఫోన్‌ను యజమానికి అందజేసిన ఆర్టీసీ సిబ్బంది....




**వేములవాడ ఏప్రిల్ 06 (మన వార్త )**కోరుట్ల నుండి వేములవాడకు ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సులో తంత్రియాల వద్ద తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్న యం. రవి అనే ప్రయాణికుడికి, వేములవాడ ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్టీసీ సిబ్బంది ఆదర్శప్రాయంగా తిరిగి అందజేశారు. ఈ ఘటనలో ఆర్టీసీ అధికారులు పి.ఆర్.ఓ శ్రీనివాస్ యాదవ్, కండక్టర్లు లక్ష్మణ్, కనకయ్య ఆధ్వర్యంలో బస్ కండక్టర్ యం. సుజాత బాధ్యతాయుతంగా వ్యవహరించి ఫోన్‌ను గుర్తించి భద్రపరిచి, అనంతరం యజమాని యం. రవికి అందజేశారు. ఈ సందర్భంగా యం. రవి మాట్లాడుతూ, తనకు ఎంతో విలువైన ఫోన్‌ను సురక్షితంగా తిరిగి అందించిన ఆర్టీసీ సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ, సేవాభావం ప్రశంసనీయం అని అన్నారు.

## ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు..



**ఇల్లందకుంట,ఏప్రిల్ 07( మన వార్త ప్రతినిధి):**ఇల్లందకుంట మండలశీ కనగర్తి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశారు. సదరు చలివేంద్రాన్ని మంగళవారం గ్రామ సర్పంచ్ రామంచ సంపత్, వార్డు సభ్యులు, కార్యదర్శి క్రాంతి కుమార్ గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఊరి ప్రజలతో పాటు బాటసారులకు ప్రస్తుత వేసవికాలం దృష్ట్యా.. దాహార్తి తీర్చాలని సదుద్దేశంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. గ్రామ స్తులు, వాహనదారులు, ఎవరైనా సరే ప్రస్తుత ఎండాకాలం నేపథ్యంలో సమృద్ధిగా నీరు సేవించాలని సూచించారు. వివిధ రకాల వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లేవారు తాగునీరు అధిక మొత్తంలో తీసుకోవడం ఉత్తమమని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎస్ సి కార్పొరేషన్ దరఖాస్తులకు చివరి గడువు...



**-అభ్యర్థులు వెంటనే పూర్తి చేయండి...**

**సిరికొండ, ఏప్రిల్ 07 (మన వార్త)** ఎస్ సి కార్పొరేషన్‌కు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తుల చివరి తేదీ 08-04-2026గా నిర్ణయించబడినందున సంబంధిత అభ్యర్థులు తమ దరఖాస్తు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. అలాగే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు తమ దరఖాస్తుల హార్డ్ కాపీలను 09-04-2026 ఉదయం 11:00 గంటలలోపు సిరికొండ మండల కార్యాలయం (ఏం పి డి ఓ) కార్యాలయం లో సమర్పించవలసి ఉంటుంది. నిర్దేశిత గడువు తర్వాత సమర్పించిన దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబోమని మండల పరిషత్ అభివృద్ధి అధికారి స్పష్టం చేశారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఏం పి డి ఓ) అభ్యర్థులు గడువు తేదీలను గమనించి సమయానికి దరఖాస్తులు పూర్తి చేసుకోవాలని కోరారు.

## పందిమడుగు గ్రామంలో వడగండ్ల వర్షంతో 150 ఎకరాల్లో వరి పంట నష్టం...


**-రైతులకు పరిహారం కోరుతూ వినతి...**

**సిరికొండ, ఏప్రిల్ 07 (మన వార్త)**సిరికొండ మండలంలోని పందిమడుగు గ్రామంలో ఇటీవల కురిసిన



వడగండ్ల వర్షం కారణంగా వరి పంట తీవ్రంగా దెబ్బతిన్నది. గ్రామంలో దాదాపు 1500 ఎకరాల్లో వరి సాగు జరుగుతుండగా అందులో సుమారు 150 ఎకరాల్లో పంట పూర్తిగా నష్టపోయినట్లు గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు .ఈ నేపథ్యంలో పందిమడుగు గ్రామ వి సి డి ఆధ్వర్యంలో మండల తహసిల్దార్ (ఎమ్మార్వో) ని కలిసి వినతిపత్రం సమర్పించారు. వడగండ్ల వర్షం వల్ల జరిగిన పంట నష్టాన్ని తక్షణమే వ్యవసాయ అధికారులతో క్షేత్రస్థాయిలో అంచనా వేయించి, బాధిత రైతులకు సరైన నష్టపరిహారం అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో (ఏ ఐ యు కె ఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి బి. బాబన్న, వి సి డి అధ్యక్షులు మోహన్ నాయక్, ఉపాధ్యక్షులు బన్సీ నాయక్, కార్యదర్శి కొంకటి ఆశిష్, కోశాధికారి ఈర్ల రవి, అలాగే సభ్యులు బి. బాలు, శ్రీను, నర్సన్న మరియు స్థానిక రైతులుతదితరులు పాల్గొన్నారు.

## యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం



**డెస్క్,** నేటి వేగవంతమైన జీవనశైలిలో ప్రతి ఒక్కరూ తమ శక్తి స్థాయిలను మరియు స్థైర్యాన్ని నిలుపుకోవడం ఎంతో అవసరమని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కేవలం ఆహారం మరియు సాధారణ వ్యాయామాల ద్వారానే కాకుండా, క్రమం తప్పకుండా యోగాసనాలను అభ్యసించడం ద్వారా శరీరానికి కావాల్సిన అసలైన శక్తిని పొందవచ్చు. యోగా అనేది కేవలం శారీరక కసరత్తు మాత్రమే కాకుండా, శరీరంలో రక్త ప్రసరణను మెరుగుపరిచి కండరాలకు ఆక్సిజన్ సరఫరాను పెంచుతుంది. ఇది నాడీ వ్యవస్థను సమతుల్యం చేయడం ద్వారా తక్షణ ఫలితాల కంటే కూడా దీర్ఘకాలికంగా శరీరాన్ని దృఢంగా ఉంచడంలో మరియు అలసటను మూలాల నుండి తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. శక్తిని పెంచే ప్రాథమిక ఆసనాల్లో తాడాసనం మరియు అధోముఖ శ్వానాసనం అత్యంత ముఖ్యమైనవిగా పరిగణించబడుతున్నాయి. తాడాసనం వేయడం వల్ల వెన్నెముక నిటారుగా మారి, అలసట వల్ల కలిగే చెడు భంగిమలు సరివుతాయి. ఇది కాళ్లు మరియు మడమలను బలపరుస్తూ శ్వాస ప్రక్రియను క్రమబద్ధీకరిస్తుంది. అలాగే అధోముఖ శ్వానాసనం శరీరాన్ని వి ఆకారంలో ఉంచి అభ్యసించడం వల్ల మెదడు మరియు గుండెకు రక్తప్రసరణ వేగవంతమవుతుంది. ఈ ఆసనం కాళ్లు, వెన్ను మరియు భుజాలకు మంచి వ్యాయామం కల్పించి, శరీరానికి సరికొత్త ఉత్సాహాన్ని అందిస్తుందని యోగా నిపుణులు వివరిస్తున్నారు. శారీరక స్థైర్యాన్ని పెంచే క్రమంలో వీరభద్రాసనం మరియు ఉత్కటాసనం వంటివి అద్భుతంగా పనిచేస్తాయి. వీరభద్రాసనం మొదటి మరియు రెండవ దశలు కాళ్లు, నడుము మరియు ఛాతీ భాగాలను దృఢపరుస్తాయి. దీనివల్ల ఊపిరితిత్తుల సామర్థ్యం పెరగడమే కాకుండా శరీరంలో వేడి జనించి సహజమైన శక్తి విడుదలవుతుంది. ఇక ఉత్కటాసనం లేదా చైర్ పోజ్ ద్వారా తొడలు మరియు కోర్ భాగం బలోపేతం అవుతాయి. మొత్తంగా చూస్తే యోగా అనేది కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా మానసిక ప్రశాంతతకు మరియు ఏకాగ్రతకు ఎంతో దోహదపడుతుంది. క్రమం తప్పకుండా ఈ ఏడు రకాల ఆసనాలను అభ్యసించడం ద్వారా ఒత్తిడి తగ్గి, సహజ సిద్ధమైన పద్ధతిలో స్టామినా పెరుగుతుంది. యోగా ద్వారా లభించే శక్తి దీర్ఘకాలం పాటు ఉండి, వృద్ధాప్య ఛాయలను కూడా అడ్డుకుంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆరోగ్యకరమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగంగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ ఆసనాలను సరైన శిక్షణతో ప్రారంభించడం ద్వారా అద్భుతమైన ఫలితాలను పొందవచ్చు.

## వేసవి తాపం నుండి ఉపశమనం...



**డెస్క్,** భానుడి భగభగలతో వేసవి కాలం తన ప్రతాపాన్ని చూపిస్తోంది. ఇటువంటి సమయంలో శరీర ఉష్ణోగ్రతను సమతుల్యం చేస్తూ ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండటం ప్రతి ఒక్కరికీ సవాలుగా మారింది. ఎండల తీవ్రత నుండి తట్టుకోవడానికి కేవలం బాహ్య రక్షణ మాత్రమే కాకుండా, మనం తీసుకునే ఆహారంలో కూడా సమూల మార్పులు చేసుకోవడం ఎంతో అవసరమని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా శరీరంలోని నీటి శాతాన్ని క్రమబద్ధీకరించడం మరియు జీర్ణవ్యవస్థను ప్రశాంతంగా ఉంచుకోవడం ద్వారా వేసవి తాపం నుండి సులభంగా బయటపడవచ్చు. ఇందుకోసం పాటించాల్సిన ముఖ్యమైన ఆహార చిట్కాలను వైద్యులు ప్రత్యేకంగా వివరించారు. వేసవిలో శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండాలంటే దాహం వేసినా వేయకపోయినా రోజంతా తగినంత నీరు తాగుతూ ఉండాలి. నీరు శరీరాన్ని ఎల్లప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉంచుతూ శక్తిని అందిస్తుంది. దీంతో పాటు సీజనల్ పండ్లయిన పుచ్చకాయ, కర్బూజా వంటి వాటిని ఆహారంలో భాగంగా చేసుకోవాలి. ఈ పండ్లలో 90 శాతం పైగా నీరు ఉండటమే కాకుండా, శరీరానికి అవసరమైన విటమిన్లను సమృద్ధిగా అందిస్తాయి. భోజనంలో పెరుగు లేదా మజ్జిగను తప్పనిసరిగా చేర్చుకోవడం వేసవిలో అత్యంత ఉత్తమమైన అలవాటు. పెరుగులో ఉండే ప్రోబయోటిక్స్ పొట్టను ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. సలాడ్ రూపంలో దోసకాయలను తీసుకోవడం వల్ల శరీరానికి చలవ చేయడమే కాకుండా చర్మం కాంతివంతంగా మారుతుంది. కూల్ డ్రింక్స్, సోడాల వంటి కృత్రిమ చక్కెర పానీయాల కంటే కొబ్బరి నీళ్లు లేదా పుదీనా నిమ్మరసం తీసుకోవడం ఎంతో మేలు చేస్తుంది. ఇవి శరీరానికి సహజమైన ఎలక్ట్రోలైట్లను అందించి తక్షణ శక్తిని ఇస్తాయి. రాత్రి పూట భోజనం విషయంలో కూడా ప్రత్యేక జాగ్రత్తలు అవసరం. మరీ ఎక్కువగా తినకుండా తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవడం వల్ల వేసవిలో కూడా హాయిగా నిద్ర పడుతుంది. మనం తినే ఆహారమే మన ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుంది కాబట్టి, ఈ చిన్న చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా వేసవిని ఆరోగ్యంగా ఆస్వాదించవచ్చు. ప్రకృతి సిద్ధంగా లభించే ఆహార పదార్థాలకు ప్రాధాన్యతనిస్తూ వేసవి తాపాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలని ఆరోగ్య నిపుణులు హితవు పలుకుతున్నారు.

## నిశ్శబ్ద విలన్‌గా మారుతున్న నిద్రలేమి



**డెస్క్,** ఆరోగ్యంగా ఉండాలంటే సరైన ఆహారం మరియు మంచి జీవనశైలి ఎంత ముఖ్యమో, ప్రతిరోజూ సరిపడా నిద్ర కూడా అంతే అవసరమని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలా మంది నిద్రను నిర్లక్ష్యం చేస్తూ పని ఒత్తిడిలో గడుపుతున్నారు. అయితే రోజుకు కనీసం 7 నుండి 8 గంటల గాఢ నిద్ర లేకపోవడం వల్ల శరీరంలోని అంతర్గత వ్యవస్థలు దెబ్బతినే అవకాశం ఉంది. నిద్రలేమి అనేది కేవలం అలసటకే పరిమితం కాకుండా, దీర్ఘకాలంలో అధిక రక్తపోటు, మధుమేహం, ఊబకాయం మరియు గుండె జబ్బుల వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీస్తోంది. శరీరానికి తగినంత విశ్రాంతి దొరకనప్పుడు నాడీ వ్యవస్థపై ఒత్తిడి పెరిగి, అది నేరుగా మన శారీరక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. మానసిక ఆరోగ్యంపై నిద్రలేమి చూపే ప్రభావం అత్యంత ఆందోళనకరంగా మారుతోంది. నిద్ర కరువైనప్పుడు మెదడులోని రసాయనాల సమతుల్యత దెబ్బతిని ఒత్తిడి మరియు ఆందోళన (ూఅ×ఱవ్ఎ) పెరుగుతాయి. ఇది క్రమంగా డిప్రెషన్‌కు దారితీసే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పిల్లల్లో నిద్రలేమి వల్ల జ్ఞాపకశక్తి తగ్గడం, చదువుపై ఏకాగ్రత లోపించడం మరియు ప్రవర్తనలో ఆకస్మిక మార్పులు రావడం వంటి సమస్యలు తలెత్తుతాయి. పగటిపూట నిరంతరం నిద్రమత్తుగా ఉండటం వల్ల నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవ్వడమే కాకుండా, కార్యాలయాల్లో మరియు పాఠశాలల్లో పనితీరు మందగిస్తుంది. ఇది వ్యక్తిగత మరియు వృత్తిపరమైన ఎదుగుదలకు పెద్ద అడ్డంకిగా మారుతుంది. వినియోగదారులు తమలో నిద్రలేమి సమస్య ఉందో లేదో కొన్ని ప్రాథమిక లక్షణాల ద్వారా గుర్తించవచ్చు. ఎప్పుడూ అలసటగా అనిపించడం, తరచుగా తలనొప్పి రావడం, కళ్లలో మంటలు మరియు ఏకాగ్రత కుదరకపోవడం వంటివి నిద్రలేమికి ప్రధాన సంకేతాలు. వాహనం నడుపుతున్నప్పుడు నిద్రమత్తు రావడం లేదా టీవీ చూస్తున్నప్పుడు త్వరగా నిద్రలోకి జారుకోవడం వంటివి తీవ్రమైన హెచ్చరికలుగా భావించాలి. జ్ఞాపకశక్తి తగ్గడం మరియు చిన్న విషయాలకే చిరాకు పడటం కూడా నిద్ర కరువైనట్లు తెలియజేసే లక్షణాలే. ఈ లక్షణాలలో రెండు లేదా అంతకంటే ఎక్కువ మీలో కనిపిస్తే, మీరు నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించి తక్షణమే జాగ్రత్తలు తీసుకోవడం ప్రారంభించాలి. నిద్రను నిర్లక్ష్యం చేయడం అనేది మన ఆరోగ్యానికి చేస్తున్న అతిపెద్ద ద్రోహమని గుర్తించాలి. ఏఐ వంటి సరికొత్త సాంకేతిక అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని భావిస్తున్న నేటి కాలంలో, మెదడు చురుగ్గా ఉండాలంటే నిద్ర ఎంతో అవసరం. ఎదురుదెబ్బలకు అధైర్యపడకుండా ముందుకు సాగాలంటే మానసిక దృఢత్వం కావాలి, దానికి నిద్రే ప్రాణాధారం. కేవలం డబ్బు వెనుక పరిగెత్తకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ముఖ్యం. రాత్రిపూట డిజిటల్ స్క్రీన్లకు దూరంగా ఉండి, ప్రశాంతమైన వాతావరణంలో నిద్రపోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఒకవేళ జీవనశైలి మార్పుల తర్వాత కూడా నిద్ర పట్టకపోతే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిపుణులైన వైద్యులను సంప్రదించి తగిన చికిత్స పొందడం శ్రేయస్కరం.

## మార్కెట్లు లాభాల దిశలో ముగింపు




**ముంబై,** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజు లాభాల బాటలో కొనసాగాయి. ట్రేడింగ్ చివరి గంటలో కొనుగోళ్ల జోరు పెరగడంతో సూచీలు భారీ లాభాలతో ముగిశాయి. ఈరోజు ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఐదు వందల ఏడు పాయింట్లకు పైగా పెరిగి డెబ్బై నాలుగు వేల ఆరు వందల పదహారు స్థాయికి చేరుకుంది. అదే విధంగా నిఫ్టీ కూడా నూట యాభై ఐదు పాయింట్లకు పైగా లాభపడి ఇరవై మూడు వేల నూట ఇరవై మూడు స్థాయిలో ముగిసింది. రిజర్వ్ బ్యాంక్ విధాన నిర్ణయాలకు ముందు ఇన్వెస్టర్లు జాగ్రత్తగా వ్యవహరించినప్పటికీ, చివరి సెషన్‌లో ఐటీ, లోహ రంగ షేర్లలో కొనుగోళ్లు పెరగడం మార్కెట్‌కు ఊతమిచ్చింది. ముఖ్యంగా విప్రో, హిందాల్కో, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు లాభాల్లో నిలిచాయి. రేపు వెలువడనున్న ద్రవ్య విధాన నిర్ణయాల్లో వడ్డీ రేట్లు మార్పు ఉండదనే అంచనాలు ఉన్నప్పటికీ, భవిష్యత్ విధానాలపై గవర్నర్ వ్యాఖ్యలపై పెట్టుబడిదారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రంగాల వారీగా చూస్తే ఐటీ, రియల్టీ, లోహ రంగాలు రాణించగా, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. మధ్యతరహా సూచీలు స్వల్ప లాభాల్లో ముగియగా, చిన్నతరహా సూచీలు స్వల్ప నష్టాలను నమోదు చేశాయి. మార్కెట్‌కు సమీప కాలంలో ఇరవై మూడు వేల స్థాయిలో మద్దతు ఉండగా, ఇరవై మూడు వేల ఐదు వందల పైబడి నిరోధం ఉండొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

## డీమార్ట్ సక్సెస్ వెనుక రహస్యాలు




**ముంబై,** దేశంలోని రిటైల్ రంగంలో ప్రముఖ స్థానం సంపాదించిన డీమార్ట్ సంస్థ మరో మైలురాయిని అధిగమించింది. దేశవ్యాప్తంగా ఐదు వందలవ స్టోర్‌ను ప్రారంభించి తన వృద్ధిని మరింత విస్తరించింది. ఒక చిన్న దుకాణంగా ప్రారంభమైన ఈ సంస్థ, క్రమంగా వినియోగదారుల నమ్మకాన్ని సంపాదిస్తూ భారీ రిటైల్ శృంఖలగా ఎదగడం విశేషంగా నిలిచింది. ఈ విజయానికి ప్రధాన కారణంగా తక్కువ ధరలో నాణ్యమైన వస్తువులను అందించడం నిలుస్తోంది. కంపెనీ ఎక్కువగా స్వంత ప్రాంగణాల్లోనే స్టోర్లను నిర్వహించడం వల్ల అద్దె ఖర్చులు తగ్గి, ఆ లాభాన్ని వినియోగదారులకు తగ్గింపు రూపంలో అందిస్తోంది. సరఫరాదారులకు తక్షణ చెల్లింపులు చేయడం ద్వారా తక్కువ ధరలకు సరుకులను పొందుతూ మరింత రాయితీలు ఇవ్వగలుగుతోంది. మహారాష్ట్రలో ప్రారంభమైన ఈ సంస్థ ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గుజరాత్, మధ్యప్రదేశ్ వంటి అనేక రాష్ట్రాల్లో విస్తరించింది. వేలాది మందికి ఉపాధి అవకాశాలను కల్పిస్తూ ముందుకు సాగుతోంది. ఇక ఆన్‌లైన్ రంగంలో కూడా తన సేవలను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఒకే ప్రాంతంలో వరుసగా స్టోర్లను ప్రారంభించడం ద్వారా రవాణా, సరఫరా ఖర్చులను తగ్గించడం ఈ సంస్థ ప్రత్యేకతగా నిలిచింది. వినియోగదారులకు తక్కువ ధరలో మంచి నాణ్యత కలిగిన వస్తువులు అందించాలనే లక్ష్యంతో సంస్థ ముందుకు సాగుతోంది.

## పెట్రోల్ బంకుల్లో ఈ20 అమలు




**న్యూఢిల్లీ,**దేశవ్యాప్తంగా వాహనదారులు గమనించాల్సిన కీలక మార్పు అమల్లోకి వచ్చింది. ఇకపై పెట్రోల్ బంకుల్లో సాధారణ పెట్రోల్ స్థానంలో ఈ20 మిశ్రమ ఇంధనం అందుబాటులోకి వస్తోంది. ఈ ఇంధనంలో ఎనభై శాతం పెట్రోల్‌తో పాటు ఇరవై శాతం ఇథనాల్ కలిపి ఉంటుంది. ఇథనాల్‌ను ప్రధానంగా చెరకు వంటి వ్యవసాయ ఉత్పత్తుల అవశేషాల నుంచి తయారు చేస్తారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే ముడి చమురు పై ఆధారాన్ని తగ్గించడమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా ప్రభుత్వం భావిస్తోంది. దేశానికి అవసరమైన చమురు లో పెద్ద భాగం దిగుమతుల ద్వారానే వస్తుండటంతో, ఇథనాల్ వినియోగాన్ని పెంచడం ద్వారా ఖర్చులను తగ్గించి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. వాహనదారులలో ఈ ఇంధనంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల తయారైన వాహనాలు ఈ20 ఇంధనానికి అనుకూలంగా ఉండటంతో పెద్దగా సమస్యలు ఉండవని నిపుణులు చెబుతున్నారు. అయితే పాత వాహనాల్లో మైలేజీ కొంత తగ్గే అవకాశం ఉండటంతో పాటు, దీర్ఘకాలంలో ఇంజిన్ భాగాలపై ప్రభావం ఉండొచ్చని సూచిస్తున్నారు. కొత్త మార్పులకు అనుగుణంగా వాహనదారులు తమ వాహనాల వినియోగంపై అవగాహన పెంచుకోవడం అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఐఆర్‌సీటీసీకి భారీ షాక్




**న్యూఢిల్లీ,** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన రైల్ నీర్ కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. సమాచార హక్కు చట్టం కింద వివరాలు ఇవ్వడాన్ని నిరాకరించిన ఐఆర్‌సీటీసీ అధికారుల తీరుపై కేంద్ర సమాచార కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ టెండర్లలో అక్రమాలు చేసిన సంస్థల వివరాలను ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టడం సరికాదని స్పష్టం చేసింది. ప్రజాధనంతో సంబంధం ఉన్న వ్యవహారాల్లో పారదర్శకత తప్పనిసరి అని కమిషన్ గట్టిగా హెచ్చరించింది. గతంలో రైల్ నీర్ కుంభకోణం దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారి తీసింది. ఈ కేసులో సంబంధిత సంస్థలపై అమలు సంస్థ ఇప్పటికే మోసం, నేర కుట్ర వంటి కేసులు నమోదు చేసింది. ఆ సంస్థలు టెండర్ల సమయంలో ఈ వివరాలను వెల్లడించాయా లేదా అన్నది తెలుసుకోవడానికి ఒక పౌరుడు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే వ్యాపార రహస్యాల పేరుతో ఆ సమాచారాన్ని ఇవ్వలేమని ఐఆర్‌సీటీసీ అధికారులు చెప్పడం వివాదాస్పదంగా మారింది. ఈ నిర్ణయాన్ని కేంద్ర సమాచార కమిషన్ తప్పుబడుతూ, సమాచారం నిరాకరించడానికి సరైన కారణాలు చూపాల్సిన బాధ్యత అధికారులదేనని పేర్కొంది. చట్టంలోని నిబంధనలను సాకుగా చూపి బాధ్యతల నుంచి తప్పించుకోవడం సమంజసం కాదని స్పష్టం చేసింది. ప్రజలు అడిగిన సమాచారాన్ని దాచిపెట్టడం ద్వారా అవినీతి అనుమానాలకు తావిస్తోందని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో ఆ దరఖాస్తును వెంటనే పునఃసమీక్షించాలని కమిషన్ ఆదేశించింది. పాత సమాధానాన్ని పక్కనపెట్టి స్పష్టమైన కారణాలతో కొత్తగా సమాధానం ఇవ్వాలని గడువు విధించింది. ఈ పరిణామంతో రైల్వే టెండర్ల వ్యవహారాల్లో దాగి ఉన్న అంశాలు త్వరలో వెలుగులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# పాన్ ఇండియా లెవల్‌లో 'జై హనుమాన్' హైప్..



**హైదరాబాద్,** పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన హనుమాన్ చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కుతున్న జై హనుమాన్ ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. దర్శకుడు ప్రశాంత్ వర్మ ఈ ప్రాజెక్ట్‌ను మరింత ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దేందుకు భారీ ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. కర్ణాటకలోని అంజనాద్రి ప్రాంతంలో ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం సైలెంట్‌గా కొనసాగుతోంది. శ్రీరాముడికి హనుమంతుడు ఇచ్చిన వాగ్దానం నేపథ్యంలో కథ నడుస్తుందని సమాచారం. ఈసారి కథ మరింత ఎమోషన్, విజువల్ గ్రాండియర్‌తో ఉండబోతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రంలో రిషబ్ శెట్టి హనుమంతుడి పాత్రలో కనిపించనుండటం ప్రధాన ఆకర్షణగా మారింది. అలాగే రానా దగ్గుబాటి కీలక పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. మొదటి భాగంలో మెప్పించిన తేజ సజ్జా కూడా ఈ సీక్వెల్‌లో కొనసాగుతున్నాడు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. టెక్నికల్ టీమ్‌లో కూడా మార్పులు చేసి సినిమాను మరింత రిచ్‌గా చూపించేందుకు ప్రయత్నిస్తున్నారు. సినిమాటోగ్రఫీ కోసం నిమిష్ రవి రంగంలోకి దిగగా, సంగీతం బాధ్యతలను ఆస్కార్ అవార్డు గ్రహీత ఎం. ఎం. కీరవాణి చేపట్టారు. 2024 సంక్రాంతి సందర్భంగా విడుదలైన 'హనుమాన్' రూ. 300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు అదే స్థాయిలో, అంతకంటే ఎక్కువగా 'జై హనుమాన్'ను తీసుకురావాలని దర్శకుడు ప్రశాంత్ వర్మ కృషి చేస్తున్నారు. తెలుగు సహా పలు భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రం పాన్ ఇండియా మార్కెట్‌ను టార్గెట్ చేస్తోంది. భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న ఈ సీక్వెల్ మరోసారి బాక్సాఫీస్‌ను షేక్ చేస్తుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

# వైభవ్‌కు బుమ్రా పరీక్ష...




**గువాహాటి,** ఐపీఎల్ సీజన్‌లో సంచలనంగా మారిన యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి నేడు అసలైన సవాల్ ఎదురుకానుంది. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో దూకుడైన బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లను ఉక్కిరిబిక్కిరి చేసిన ఈ యువ ఆటగాడు, ఇప్పుడు ప్రపంచ స్థాయి పేసర్ జస్ప్రీత్ బుమ్రాను ఎదుర్కోబోతున్నాడు. పవర్ ప్లేలో తన దాడి ధోరణితో ఆకట్టుకున్న వైభవ్, యార్కర్‌లకు ప్రసిద్ధి చెందిన బుమ్రాను ఎలా ఎదుర్కొంటాడన్నది అభిమానుల్లో ఉత్కంఠ రేపుతోంది. రాజస్థాన్ జట్టు వరుస విజయాలతో జోరులో ఉండగా, ముంబై జట్టుతో జరగనున్న ఈ పోరు మరింత ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా ఈ మ్యాచ్‌లో అందరి దృష్టి వైభవ్ ప్రదర్శనపైనే ఉంది. తొలి మ్యాచ్‌లోనే తక్కువ బంతుల్లో అర్ధశతకం నమోదు చేసి రికార్డు సృష్టించిన అతడు, తదుపరి మ్యాచ్‌లో కూడా అదే దూకుడు కొనసాగించాడు. యశస్వీ జైస్వాల్‌తో కలిసి జట్టుకు శుభారంభాలు అందిస్తూ తన ప్రతిభను చాటుకున్నాడు. గత రెండు మ్యాచ్‌ల్లో అతని స్ట్రైక్ రేట్ రెండు వందల పైగా ఉండటం అతని దూకుడును తెలియజేస్తోంది. అయితే ఇప్పుడు అతడు ఎదుర్కోబోయేది అనుభవజ్ఞుడైన బుమ్రా. కీలక సందర్భాల్లో యార్కర్‌లతో బ్యాటర్లను ఇబ్బంది పెట్టే బుమ్రా ఎదుట నిలబడటం సవాల్‌గా మారనుంది. వైభవ్ తన దూకుడును కొనసాగిస్తాడా లేదా బుమ్రా బౌలింగ్‌కు లొంగిపోతాడా అన్నది చూడాలి. ఈ పోరులో యువ ఆటగాడి ధైర్యం గెలుస్తుందా లేక అనుభవం గెలుస్తుందా అన్నది క్రీడాభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది. ఏదేమైనా ఈ మ్యాచ్‌లో జరిగే ఈ తలపోరు ఐపీఎల్‌లో అత్యంత ఆసక్తికర ఘట్టంగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మన వార్త దినపత్రిక పక్షాన దెబ్బటి రాజలక్ష్మి, శ్రీనివాస్ గార్లకు
వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు





# మహేష్ రాజమౌళి సినిమాకు విరామం



**వారాణసి,** సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శక ధీరుడు ఎస్. ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ పాన్ వరల్డ్ సినిమా షూటింగ్‌కు తాత్కాలిక విరామం ఇవ్వాలని చిత్ర యూనిట్ నిర్ణయించింది. ప్రస్తుతం హైదరాబాద్ సమీపంలోని శంకరపల్లిలో వేగంగా సాగుతున్న ఈ సినిమా చిత్రీకరణలో కీలక సన్నివేశాలు తెరకెక్కుతున్నాయి. వారాణసి నగరాన్ని ప్రతిబింబించేలా భారీ సెట్లలో షూటింగ్ జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కూడా పాల్గొంటూ ముఖ్యమైన సన్నివేశాల్లో నటిస్తున్నారు. ఈ షెడ్యూల్ మరో రెండు వారాలు కొనసాగనున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో మహేష్ బాబు 'రుద్ర' పాత్రలో కనిపించనున్నట్లు, ప్రియాంక చోప్రా 'మందాకిని' పాత్రలో నటిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన రావడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. అయితే వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మే నెల మొత్తం షూటింగ్‌కు విరామం ఇవ్వాలని యూనిట్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ విరామ సమయంలో మహేష్ బాబు కుటుంబంతో విదేశీ పర్యటనకు వెళ్లనున్నారని, రాజమౌళి కూడా కొంత విశ్రాంతి తీసుకోనున్నట్లు సమాచారం. సాధారణంగా సినిమా పూర్తయ్యే వరకు నిరంతరంగా షూటింగ్ చేసే రాజమౌళి ఈసారి బ్రేక్ ఇవ్వడం విశేషంగా మారింది. ఇప్పటికే దాదాపు 70 శాతం చిత్రీకరణ పూర్తయిన ఈ సినిమా, విరామం తర్వాత మరింత వేగంగా కొనసాగనున్నట్లు తెలుస్తోంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా సమాంతరంగా నిర్వహిస్తూ 2027 వేసవిలో సినిమా విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. విరామం అనంతరం అంటార్కిటికాలో కీలక షెడ్యూల్ ప్లాన్ చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అక్కడి తీవ్ర చలి పరిస్థితుల్లో షూటింగ్ ఎలా నిర్వహిస్తారన్నది ఆసక్తిగా మారింది. వారాణసి వంటి ఆధ్యాత్మిక నేపథ్యానికి సైన్స్ ఫిక్షన్ అంశాలను జోడించి రూపొందుతున్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కావచ్చనే చర్చ కూడా కొనసాగుతోంది.

# ఐపీఎల్‌లో టాప్ వికెట్ టేకర్లు



**ముంబై,** ఇండియన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలో అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్ల జాబితా ఎప్పటికప్పుడు అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ జాబితాలో భారత బౌలర్లే ఆధిపత్యం చెలాయించడం విశేషంగా నిలుస్తోంది. ప్రస్తుతం రాజస్థాన్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న యుజ్వేంద్ర చహల్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. తన లెగ్ స్పిన్ మాయాజాలంతో బ్యాటర్లను ఇబ్బంది పెట్టుతూ ఇప్పటివరకు వందలాది మ్యాచ్‌ల్లో రెండు వందల ఇరవై నాలుగు వికెట్లు సాధించి అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. చహల్ తర్వాత రెండవ స్థానంలో భారత స్వింగ్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ నిలిచాడు. సన్‌రైజర్స్ జట్టుకు ఆడుతున్న ఆయన రెండు వందల పైగా వికెట్లు సాధించి తన స్థిరత్వాన్ని చాటుకున్నాడు. మూడవ స్థానంలో వెస్టిండీస్‌కు చెందిన సునీల్ నరైన్ ఉన్నాడు. కోల్‌కతా జట్టుకు కీలక బౌలర్‌గా నిలిచిన నరైన్ తన స్పిన్‌తో పాటు బ్యాటింగ్‌లో కూడా జట్టుకు సహకరిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందాడు. నాల్గవ స్థానంలో లెగ్ స్పిన్నర్ పీయూష్ చావ్లా కొనసాగుతున్నాడు. పలు జట్లకు ఆడిన అనుభవంతో ఆయన ఐపీఎల్‌లో తన ముద్ర వేసుకున్నాడు. ఐదవ స్థానంలో రవిచంద్రన్ అశ్విన్ మరియు జస్ప్రీత్ బుమ్రా ఉన్నారు. ఇద్దరూ వేర్వేరు బౌలింగ్ శైలులతో జట్లకు విజయాలు అందిస్తూ ఈ జాబితాలో స్థానం సంపాదించారు. ఈ జాబితాలో నలుగురు భారత బౌలర్లు ఉండటం భారత క్రికెట్ బలం ఎంత ఉన్నదో తెలియజేస్తోంది. ఐపీఎల్ వేదికగా తమ ప్రతిభను నిరూపించుకున్న ఈ బౌలర్లు భవిష్యత్తులో మరిన్ని రికార్డులు సృష్టించే అవకాశాలు ఉన్నాయని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.

Edited, Published & Owned by **BHUPATHI SANTHOSH.** Printed at PARAHUSHAR PRINTING PUBLICATIONS, H. NO. 1-6-27/2,SRI NAGAR COLONY, Mahabubabad,, TELANGANA-506101.
Published at Jammikunta, **KARIMNAGAR-TELANGANA**. EDITOR: BHUPATHI SANTHOSH. Cell: 9247819181 | **RNI No: TGTEL/25/A1882,**Email:Mana vaartha tg. Daily@gmail.com